సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
శనివారం, 21.11.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:14 సంచిక: 014
పేజీలు: 08 వెల: రూ. 5

ప్రపంచ రాజకీయాల్లో భారత్ 'సైడ్ ప్లేయర్'

- అమెరికా–ఇరాన్ యుద్ధంపై పాక్ మధ్యవర్తిత్వం..
- భారత్ ఎక్కడంటూ రాహుల్ ప్రశ్న
- విదేశీ గడ్డపై భారత్ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారంటూ బీజేపీ ఆగ్రహం
- మోదీ విదేశాంగ విధానంపై రాహుల్ విమర్శలు..
- కాంగ్రెస్‌పై బీజేపీ ఎదురుదాడి



6

ఎఫ్ఎన్‌సీసీ మీడియా కమిటీ చైర్మన్‌గా కే.సత్యనారాయణ

- ఎఫ్ఎన్‌సీసీ మీడియా విభాగానికి కొత్త సారథి
- సీనియర్ జర్నలిస్టు, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు సత్యనారాయణకు కీలక బాధ్యతలు
- ఎఫ్ఎన్‌సీసీ ప్రతిష్ఠ పెంపునకు ప్రత్యేక కార్యాచరణ



3

రేఖానాయక్ ఇంటిపై ఈడీ మెరుపు దాడి

- రూ.40.96 కోట్ల విలువైన సీఎంఆర్ ధాన్యం పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు
- ఖానాపూర్, హైదరాబాద్‌లలో ఉదయం నుంచే ముమ్మరంగా సాగుతున్న తనిఖీలు
- ఖానాపూర్ నివాసం వద్ద రేఖను అరెస్ట్ చేసే అవకాశం



2

చిల్లర మాటలు.. అబద్ధాలతో కాలయాపన

- సిద్దిపేటకు చిల్లిగవ్వ మేలైనా చేశారా?
- ₹1,070 కోట్ల పెండింగ్ పనుల ప్రస్తావనేది
- రేవంత్ వ్యాఖ్యలపై కేటీఆర్, హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం



7



కాంగ్రెస్ ప్రక్షాళన

81 మంది నూతన జాతీయ కార్యదర్శులు నియామకం

- 50 శాతం మంది ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలు 2029 ఎన్నికలే లక్ష్యంగా..
- సామాజిక న్యాయానికి పెద్దపీట
- ఏఐసీసీ నూతన కార్యదర్శుల జాబితా విడుదల..
- 43 మంది కొత్త ముఖాలకు చోటు
- యువత, బడుగు బలహీన వర్గాలకే అగ్రతాంబూలం
- రాహుల్ గాంధీ మార్క్ టీమ్..

2


తెలంగాణపై జమిలి అస్త్రం

2029 ఎన్నికలే టార్గెట్

- 2028 ఎన్నికలను వాయిదా వేస్తారా?
- దక్షిణాదిలో పాగా వేయాలని కమలం ప్లాన్
- జమిలి అస్త్రంతో కాంగ్రెస్‌కు చెక్!
- తెలంగాణ, కర్ణాటకలో అధికారం లక్ష్యం
- ఏపీలో ఎంపీ సీట్ల పెంపుపై వ్యూహం
- ప్రాంతీయ పార్టీలకు షాక్ ఇచ్చేలా వ్యూహం
- 2029లో కమలం వ్యూహం ఫలించేనా?

తెలంగాణపై బీజేపీ ప్రత్యేక గురి

మోదీ ఇమేజ్‌తో అధికార పీఠంపై కన్ను



ముద్ర, తెలంగాణ బ్యూరో :

దక్షిణ భారతదేశంలో రాజకీయంగా పట్టు సాధించేందుకు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కొత్త వ్యూహాలకు పదును పెడుతోందా? తెలంగాణలో అధికార పీఠాన్ని దక్కించుకోవడంతో పాటు ఆంధ్ర ప్రదేశ్‌లో పార్టీ బలాన్ని పెంచుకునేందుకు జమిలి ఎన్నికలను అస్త్రంగా మలచుకోవాలని చూస్తోందా? 2029లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించే దిశగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం అడుగులు వేస్తుందన్న ప్రచారం నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ముఖ్యంగా తెలంగాణ, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలను లోక్‌సభ ఎన్నికలతో సమన్వయం చేసే అంశం తెరపైకి వస్తోంది. ఇదే జరిగితే దక్షిణాదిలో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారే అవకాశం ఉందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

దక్షిణాదిలో బలపడటమే లక్ష్యం

ప్రస్తుతం దక్షిణాదిలో బీజేపీకి ఆశించిన స్థాయిలో రాజకీయ బలం లేదు. ఐదు దక్షిణాది రాష్ట్రాల్లో ఏ ఒక్కచోటా సొంతంగా అధికారంలో లేదు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేనతో కలిసి ఎన్డీయే కూటమిలో భాగస్వామిగా కొనసాగుతోంది. అక్కడ అధికారంలో భాగస్వామిగా ఉన్నప్పటికీ సొంతంగా పార్టీ బలాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉంది. కర్ణాటకలో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ చేతిలో ఓటమి చవిచూసింది. తమిళనాడులో అన్నాడీఎంకేతో కలిసి రాజకీయంగా ఎదగాలని భావించినా ఆశించిన ఫలితం దక్కలేదు. కేరళలోనూ పార్టీ ఉనికిని విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ పెద్దగా ఫలితం కనిపించడం లేదు.

ఈ నేపథ్యంలో తెలంగాణపై బీజేపీ ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు రాజకీయ విశ్లేషణలు చెబుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య రాజకీయ పోటీ కొనసాగుతుండగా, ఈ రెండు పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఎదగాలని కమలనాథులు వ్యూహరచన చేస్తున్నారు. గత ఎన్నికల్లో సాధించిన విజయాలు, పార్లమెంట్ ఎన్నికల్లో పెరిగిన ఓటు బ్యాంకు తమకు అనుకూలంగా మారుతాయని బీజేపీ నేతలు ఆశిస్తున్నారు.

తెలంగాణపై కమలం గురి

తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకోవడం బీజేపీకి చాలాకాలంగా లక్ష్యంగా ఉంది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రెండు పర్యాయాలు బీఆర్ఎస్ అధికారంలో కొనసాగగా, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారాన్ని దక్కించుకుంది. ప్రస్తుతం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోంది. మరోవైపు బీఆర్ఎస్ పుంజుకునేందుకు మిగతా 02లో

తెలంగాణ విద్యా వ్యవస్థకు పండుగ రోజు

ఐఐటీ కలలను నిజం చేసిన విద్యా ప్రదాత

చుక్కా రామయ్యకు సీఎం రేవంత్ శుభాకాంక్షలు
వందేళ్లప్రస్థానం.. వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు
విద్యారంగానికి ఆయన సేవలు చిరస్మరణీయం

2

బాజా భజంత్రీలకు వేళాయె

మార్కెట్ కు పెళ్లి కళ



- 25 రోజుల్లో ₹7.50 లక్షల కోట్ల వ్యాపారం
- డిసెంబర్ 15 వరకు శుభ ముహూర్తాలు
- 25 రోజుల్లో దేశవ్యాప్తంగా 52 లక్షల వివాహాలు
- బంగారం, వస్త్రాలు, క్యాటరింగ్, ఫంక్షన్ హాళ్లకు గిరాకీ
- 1.25 కోట్ల మందికి తాత్కాలిక ఉపాధి లభిస్తుందని అంచనా

2



నా కథలో రావణాసురుడు కేసీఆరే

- కేటీఆర్ మేనేజ్‌మెంట్ కోటా నాయకుడని విమర్శ
- తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థి కేసీఆరేనని స్పష్టీకరణ

- **బీజేపీకి పాత్ర లేదు.. కాంగ్రెస్‌కు బీఆర్ఎస్సే ప్రధాన ప్రతిపక్షం**
- **తెలంగాణకు ఫుట్‌బాల్ స్టార్ రొనాల్డోను ఆహ్వానిస్తామని వెల్లడి**
- **మోదీ విజిటింగ్ ప్రైమ్ మినిస్టర్, ప్రభుత్వం కోసం ఎవరినైనా కలుస్తా**
- **దేశానికి రాహుల్ గాంధీ అవసరం.. అందుకే కాంగ్రెస్ వైపు వచ్చా**
- **మోదీ పాకిస్థాన్ వెళ్లి బిర్యానీ తిని వచ్చారు**
- **ఖేలో ఇండియాకు, గ్లోబల్ సమ్మిట్ కు ప్రధాని మోదీని ఆహ్వానించాం రావడం, రాకపోవడం ప్రధాని ఇష్టం**
- **సదరన్ రైజింగ్ సమ్మిట్లో సీఎం రేవంత్ రెడ్డి**

ముద్ర, తెలంగాణ బ్యూరో :

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై, ఆయన కుమారుడు కేటీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను తన కథలో 'రావణాసురుడు'గా అభివర్ణించిన రేవంత్, కేటీఆర్‌ను 'మేనేజ్‌మెంట్ కోటా' నాయకుడంటూ కొట్టిపారేశారు. తాజాగా జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో తన ప్రధాన రాజకీయ ప్రత్యర్థి కేసీఆరేనని, కేటీఆర్‌ను తాను అంత సీరియస్‌గా పరిగణించడం లేదని రేవంత్ స్పష్టం చేశారు. 'కేటీఆర్ ఒక మేనేజ్‌మెంట్ కోటా నాయకుడు. తండ్రి అండతోనే ఆయన లీడర్ అయ్యారు. బీఆర్ఎస్ పార్టీకి అధ్యక్షుడు కేసీఆర్ కాబట్టి, ఆయన్నే నేను రాజకీయ ప్రత్యర్థిగా భావిస్తాను' అని అన్నారు.


బీఆర్ఎస్ నాయకులు పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేసిన రేవంత్, కాంగ్రెస్ ప్రభుత్వం తలుచుకుంటే ఆ పార్టీని ఎప్పుడో ఖతం చేసేదని, కానీ ప్రతిపక్షంగా ఉండాలనే ఉద్దేశంతోనే దాన్ని కొనసాగనిస్తున్నామని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీకి ఎలాంటి ముఖ్య పాత్ర లేదని, కాంగ్రెస్‌కు బీఆర్ఎస్సే ప్రధాన శత్రువని ఆయన పేర్కొన్నారు. బీజేపీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో 'ఓట్ల దొంగతనానికి' పాల్పడుతోందని ఆరోపించారు. ఇదే కార్యక్రమంలో, మిగతా 02లో

రేవంత్ వన్ టైమ్ వండర్ లీడర్

రేవంత్‌కు కేసీఆర్ స్థాయి లేదు

తెలంగాణ కా బాద్ షా కేసీఆర్ మాత్రమే

- 2028లో బీఆర్ఎస్‌దే అధికారం
- రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌కు ఏటీఎం.. బిల్డర్ల నుంచి 10 శాతం వసూళ్లు
- ఢిల్లీ పెద్దలకు బ్యాగులు మోయడంలో రేవంత్‌కు 10కి 10 మార్కులు
- రేవంత్‌పై కేటీఆర్ సంచలన ఆరోపణలు



2

ఇదీ AI ముద్ర



స్టాక్ మార్కెట్‌లోకి ఏపీఎండీసీ

ఐపీవో ప్రక్రియకు ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశం

- వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్
- ఎన్ఎండీసీ తరహాలో ఏపీఎండీసీ అభివృద్ధికి ప్రణాళిక
- పెండింగ్ క్వారీ దరఖాస్తులతో రూ.400 కోట్ల ఆదాయం అంచనా



2

మగశిశువుకు జన్మనిచ్చిన సమంత

బాబుకు 'దేవ్ నిడిమోరు' అని నామకరణం

- బాబు వేలిని పట్టుకున్న మొదటి ఫొటోను నెట్టింట పంచుకున్న సమంత
- బిడ్డ పుట్టుకకు కొన్ని రోజుల ముందు ఇంట్లో ఘనంగా 'మాతృ శిశు మంగళ ఆశీర్వాదం' పూజ
- సుఖ ప్రసవం, తల్లీబిడ్డల క్షేమం కోసం శ్రీసూక్తం, గాయత్రీ హోమం నిర్వహించిన కుటుంబ సభ్యులు



2

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
శనివారం, 21 నవంబర్, 2026

జీర్ణక్రియకు సహజ మద్దతు

కొత్తిమీర ఆకుల్లో ఉండే ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి ఉపయోగపడతాయి. వీటిని తీసుకోవడం వల్ల కొందరిలో గ్యాస్, కడుపు ఉబ్బరం, అజీర్తి వంటి సమస్యలు తగ్గేందుకు సహాయపడవచ్చు.



నా కథలో రావణాసురుడు కేసీఆరే



(మొదటి పేజీ తరువాయి)

గతంలో ఫుట్‌బాల్ ఆటగాడు మెస్సీ హైదరాబాద్ వచ్చిన విషయాన్ని గుర్తుచేస్తూ, త్వరలో క్రిస్టియానో రొనాల్డోను తెలంగాణకు ఆహ్వానించే ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వ అప్పులు, దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, లోక్‌సభ సీట్ల పునర్విభజన వంటి అంశాలను ప్రస్తావిస్తూనే, రాష్ట్రంలో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' గురించి కూడా మాట్లాడారు.

సీఎం రేవంత్ రెడ్డి జాతీయ, రాష్ట్ర రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎవరికీ చెప్పకుండా పాకిస్తాన్ వెళ్లి బిర్యానీ తిని వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీని తాను రాష్ట్ర అభివృద్ధి కోసం కలిస్తే తప్పేమిటని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ ప్రతి పేదవాడి అభివృద్ధిని కోరుకున్నారని, నెహ్రూ నిర్మించిన విద్యా, సాగునీటి ప్రాజెక్టులు, పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్ తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలే దేశాభివృద్ధికి పునాదులని సీఎం పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ పార్టీనేనని గుర్తుచేస్తూ, స్వాతంత్ర్యం తెచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలు ఉన్నన్ని రోజులు, వెయ్యి ఏళ్లు ఉంటుందన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక ఈడీ, సీబీఐ, ఇన్‌కమ్ ట్యాక్స్ సంస్థలను ముందుకు తెచ్చారని, జాతి, మతం, భాష పేరుతో విభేదాలు సృష్టించారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. గత 12 ఏళ్లలో మోదీ సృష్టించిన భయాన్ని యువత 12 రోజుల్లోనే తొలగించిందని రేవంత్ రెడ్డి అన్నారు. పేదల ఓటు హక్కును తొలగించే ప్రయత్నం జరుగుతోందని, రాహుల్ గాంధీ చేపట్టిన 'ఓట్ చోర్.. గద్దీ చోర్' నినాదానికి అందరి మద్దతు లభిస్తోందని తెలిపారు. మోదీ లెక్కలేనన్ని విదేశీ పర్యటనలతో 'విజిటింగ్ ప్రైమ్ మినిస్టర్ ఆఫ్ ఇండియా'గా మారారని విమర్శించారు. మోదీ కంటే ముందు ప్రధానులు రూ.53 లక్షల కోట్ల అప్పు చేస్తే, మోదీ 12 ఏళ్లలోనే రూ.120 లక్షల కోట్ల అప్పు చేశారని అన్నారు. మోదీ ప్రభుత్వ నిధులన్నీ అదానీ జేబులో వేస్తుంటే, తాను మాత్రం అదానీ జేబులో నుంచి నిధులను తెచ్చి తెలంగాణ అభివృద్ధికి, యువత ఉపాధికి ఖర్చు చేస్తున్నానని పేర్కొన్నారు. ఖేలో ఇండియా, డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరిగే తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఆహ్వానాలకు ప్రధానిని కలిశానని తెలిపారు.

రేవంత్ రెడ్డి వన్ టైమ్ వండర్ లీడర్

ముద్ర, న్యూఢిల్లీ :

హైదరాబాద్‌లో ఏబీపీ నెట్‌వర్క్ నిర్వహించిన 'సదరన్ రైజింగ్ సమ్మిట్–2026'లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఢిల్లీ పర్యటనలు చేయడం, ఢిల్లీ పెద్దలకు బ్యాగులు మోయడం, తెలంగాణ ప్రజలను మోసం చేయడంలో రేవంత్‌కు 10కి 10 మార్కులు వేయొచ్చంటూ ఎద్దేవా చేశారు. మూడేళ్ల పాలనలో రాష్ట్రానికి చేసిన ఒక్క అభివృద్ధి పనినైనా చెప్పాలని సవాల్ విసిరారు. తెలంగాణ దేనిలో రైజింగ్ అవుతోందని.. క్రైమ్‌లోనా అంటూ ప్రశ్నించారు.

రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంగా మారారని, రాష్ట్రంలోని బిల్డర్ల నుంచి 10 శాతం వాటా వసూలు చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా తెలంగాణ నుంచే కాంగ్రెస్‌కు నిధులు వెళ్తున్నాయని విమర్శించారు. రేవంత్ రెడ్డి అవినీతి వ్యవహారాలు తెలిసినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని, ఇరు పార్టీల మధ్య రహస్య ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు.

కేసీఆర్ స్థాయి వేరు.. స్థానం వేరు

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కేటీఆర్ లివింగ్ లెజెండ్‌గా అభివర్ణించారు. రేవంత్ రెడ్డి కేవలం వన్ టైమ్ వండర్ లీడర్ మాత్రమేనని వ్యాఖ్యానించారు. కేసీఆర్ స్థాయి, ఆయన స్థానం వేరని, ఒక కొడుకు గా కాకుండా సామాన్యుడిగా ఈ మాట చెబుతున్నానన్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందన్నారు. 'అమిత్ షా హో.. కోయి ఔర్ షా హో.. తెలంగాణ కా బాద్షా హై కేసీఆర్' అంటూ వ్యాఖ్యానించారు.



కాంగ్రెస్ ప్రక్షాళన

ముద్ర, న్యూఢిల్లీ :

రాబోయే 2029 లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ అధిష్ఠానం పార్టీ సంస్థాగత నిర్మాణంలో భారీ ప్రక్షాళన చేపట్టింది. వివిధ రాష్ట్రాలు, కీలక విభాగాల పర్యవేక్షణ కోసం మొత్తం 81 మంది నూతన జాతీయ కార్యదర్శులను నియమిస్తూ ఏఐసీసీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ క్రమంలోనే గతంలో బాధ్యతలు నిర్వర్తించిన 25 మంది నాయకులను పదవుల నుంచి తప్పించి, సరికొత్తగా 43 మంది కొత్త ముఖాలకు అవకాశం కల్పించింది. ఈ నియామకాల్లో రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా 'సామాజిక న్యాయం' సూత్రానికి పెద్దపీట వేశారు. మొత్తం 81 మంది కార్యదర్శుల్లో దాదాపు మూడింట రెండు వంతుల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ మరియు మైనార్టీ వర్గాలకు చెందినవారే ఉన్నారు. ఇందులో జనరల్ కేటగిరీ నుంచి 29 మంది, ఓబీసీ నుంచి 20, ఈబీసీ నుంచి 5, ఎస్సీల నుంచి 11, ఎస్టీల నుంచి 5, మైనార్టీల నుంచి 11 మందికి చోటు దక్కింది. మహిళా ప్రాతినిధ్యం కింద 12 మందికి (సుమారు 15 శాతం) బాధ్యతలు అప్పగించారు. ఈ నేతల సగటు వయస్సు 49 ఏళ్లు కాగా, మెజారిటీ నాయకులు 50 ఏళ్ల లోపు వారే కావడం విశేషం.

ఈ ఎంపిక కోసం రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, ప్రియాంక గాంధీలు దాదాపు 200 మంది నేతలను స్వయంగా ఇంటర్వ్యూ చేసి జాబితాను సిద్ధం చేశారు. మీడియా, కమ్యూనికేషన్స్ విభాగ కార్యదర్శులుగా డాక్టర్ వినీత్ పునియా, రుచిరా చతుర్వేదిలను కొనసాగించగా, కాంగ్రెస్ అధ్యక్షుడి కార్యాలయ కార్యదర్శులుగా ప్రణవ్ ఝా, గౌరవ్ పాంధీలు తమ బాధ్యతల్లో కొనసాగనున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే బాధ్యతను ఈ నూతన కార్యదర్శుల బృందానికి కాంగ్రెస్ నాయకత్వం అప్పగించింది.

జమిలి అస్త్రంతో తెలంగాణపై బీజేపీ గురి

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నిస్తోంది. ఈ పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. 2028లో జరగాల్సిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు 2029 లోక్‌సభ ఎన్నికలతో కలిసి జరిగితే జాతీయ రాజకీయ అంశాలు ఎన్నికల ప్రచారంలో కీలకంగా మారే అవకాశం ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం, కేంద్ర ప్రభుత్వ పథకాలు, జాతీయ స్థాయి రాజకీయ అంశాలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా రాష్ట్రంలో అధికారాన్ని అందుకోవచ్చన్నది బీజేపీ వ్యూహంగా విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే తెలంగాణలో జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు అసెంబ్లీ గడువును పొడిగించాల్సి రావడం కీలకమైన అంశంగా మారనుంది.

కర్ణాటకలోనూ అదే వ్యూహం?

తెలంగాణతో పాటు కర్ణాటకపైనా బీజేపీ ఆశలు పెట్టుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. 2023 మేలో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు జరగడంతో తదుపరి ఎన్నికలు 2028లో జరగాల్సి ఉంది. అదే సమయంలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు కూడా 2028లోనే జరగనున్నాయి. ఈ రెండు రాష్ట్రాల ఎన్నికలను 2029 లోక్‌సభ ఎన్నికలతో కలిపి నిర్వహించాలంటే రాజ్యాంగపరమైన, రాజకీయపరమైన అంశాలను పరిష్కరించాల్సి ఉంటుంది. అసెంబ్లీల పదవీకాలాన్ని పొడిగించడం, లేదా ఇతర రాజ్యాంగపరమైన ప్రత్యామ్నాయాలను పరిశీలించడం వంటి అంశాలు చర్చకు వస్తున్నాయి. 2028 చివర్లోనే ఈ రెండు రాష్ట్రాలకు ఎన్నికలు నిర్వహించి, అనంతరం 2029లో జరగాల్సిన లోక్‌సభ ఎన్నికలతో సమన్వయం చేయాలన్న ఆలోచన కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. అయితే ఇలాంటి నిర్ణయాలకు రాజ్యాంగపరమైన అనుమతులు, రాజకీయ సమ్మతి అవసరం. ఇవి వ్యూహాత్మక అంచనాలు, చర్చల స్థాయిలో ఉన్నాయి.

మోదీ ఇమేజ్‌తో ప్రాంతీయ పార్టీలకు చెక్!

జమిలి ఎన్నికలు జరిగితే దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికల వాతావరణం నెలకొంటుంది. అప్పుడు రాష్ట్రాల వారీగా ఉండే స్థానిక సమస్యలతో పాటు జాతీయ స్థాయి అంశాలు కూడా ప్రచారంలో ప్రాధాన్యం పొందుతాయి. ముఖ్యంగా ప్రధాని మోదీ నాయకత్వం, కేంద్ర ప్రభుత్వ పనితీరు, జాతీయ భద్రత, అభివృద్ధి వంటి అంశాలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. ఇదే అంశాన్ని బీజేపీ తనకు అనుకూలంగా మలచుకోవాలని చూస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను, బీఆర్ఎస్ పట్ల ఉన్న రాజకీయ అసంతృప్తిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని కమలనాథులు భావిస్తున్నట్లు విశ్లేషణలు చెబుతున్నాయి. జాతీయ స్థాయి ప్రచారంతో రాష్ట్ర రాజకీయాల్లో మోదీ ఇమేజ్‌ను ప్రభావవంతంగా ఉపయోగించుకోవచ్చని అంచనా వేస్తున్నారు.

కాంగ్రెస్‌కు కష్టకాలమేనా?

జమిలి ఎన్నికలు అమలులోకి వస్తే తెలంగాణతో పాటు కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు రాజకీయంగా సవాల్ ఎదురయ్యే అవకాశం ఉంది. రెండు రాష్ట్రాల్లోనూ రాష్ట్ర ప్రభుత్వాల పనితీరుపై జరిగే చర్చతో పాటు కేంద్ర ప్రభుత్వంపై ప్రజల అభిప్రాయం కూడా ఎన్నికల్లో కీలకంగా మారుతుంది. దీంతో స్థానిక సమస్యల ఆధారంగా ఎన్నికలను ఎదుర్కోవాలనుకునే కాంగ్రెస్‌కు కొత్త సవాళ్లు ఎదురుకావచ్చన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం పరిస్థితి కొంత భిన్నంగా ఉండనుంది. అక్కడ టీడీపీ, జనసేనతో కలిసి బీజేపీ ఎన్డీయే కూటమిలో కొనసాగుతోంది. జమిలి ఎన్నికలు జరిగితే కూటమి సమన్వయంతో ఎన్నికలను ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. ఇది కూటమికి ప్రయోజనకరంగా మారుతుందని అంచనాలు ఉన్నాయి. మరోవైపు వైసీపీకి కూడా జాతీయ స్థాయి ఎన్నికల ప్రభావం సవాలుగా మారవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

2029లో కమలం వ్యూహం ఫలిస్తుందా?

2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఉత్తరాదిలో బీజేపీకి ఎదురైన రాజకీయ సవాళ్లు, కొన్ని రాష్ట్రాల్లో మారుతున్న రాజకీయ సమీకరణాలు ఆ పార్టీని కొత్త ప్రాంతాల వైపు దృష్టి సారించేలా చేస్తున్నాయన్న విశ్లేషణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో దక్షిణాదిలో బలపడటం బీజేపీకి రాజకీయంగా అత్యంత కీలకంగా మారింది. తెలంగాణలో అధికారాన్ని అందుకోవడం, కర్ణాటకలో తిరిగి పట్టు సాధించడం, ఏపీలో కూటమి ద్వారా ఎంపీ స్థానాలను పెంచుకోవడం వంటి లక్ష్యాలతో ముందుకు సాగాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే జమిలి ఎన్నికలు నిర్వహించడం అంత సులభమైన వ్యవహారం కాదు. రాజ్యాంగ సవరణలు, రాష్ట్రాల అసెంబ్లీల పదవీకాలం, రాజకీయ పార్టీల అభిప్రాయాలు వంటి అనేక అంశాలు ఇందులో కీలకం. పైగా తెలంగాణలో బీజేపీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి గట్టి పోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. కేవలం మోదీ ఇమేజ్‌తోనే రాష్ట్రంలో అధికారం సాధించడం సాధ్యమవుతుందా? స్థానిక నాయకత్వం, పార్టీ సంస్థాగత బలం, ప్రజా సమస్యలపై పోరాటం ఎంత వరకు ప్రభావం చూపుతాయన్నది కీలకమే. 2029 ఎన్నికల నాటికి దక్షిణాదిలో రాజకీయ పట్టు పెంచుకోవాలన్న బీజేపీ లక్ష్యానికి జమిలి ఎన్నికలు ఎంతవరకు ఉపయోగపడతాయో వేచి చూడాలి. తెలంగాణను ఎగరేసుకుపోవాలన్న కమలం వ్యూహం కార్యరూపం దాల్చుతుందా? లేక రాష్ట్ర రాజకీయాల ప్రత్యేకతల ముందు జాతీయ అస్త్రం తేలిపోతుందా? అన్నది తేలనుంది.

బాజా భజంత్రీలకు వేళాయె

ముద్ర, హైదరాబాద్:

దేశంలో వివాహాది శుభకార్యాలకు అవసరమైన మంచి ముహూర్తాలు సమీపించాయి. ఈనెల 21 నుంచి డిసెంబరు 15 వరకు దేశంలో మొత్తం 52 లక్షల వివాహాలు జరగనున్నాయని, ఇందుకోసం దాదాపు రూ.7.5 లక్షల కోట్ల వ్యాపారం జరుగుతుందని అఖిల భారత వ్యాపారుల సమాఖ్య (కాయిట్) అంచనా వేస్తోంది. 25 రోజుల వ్యవధిలో రోజుకు 2లక్షలకు మించి వివాహాలు జరుగుతున్నాయి.

ఈ విభాగాలన్నింటికీ గిరాకీ

భారీ ఎత్తున జరగనున్న కల్యాణ వేడుకల వల్ల రిటెయిల్ వ్యాపారం, తయారీ రంగం, ఆతిథ్య రంగం, రవాణా, ఆహార పదార్థాలు, ఆభరణాల రంగాలకు భారీగా డిమాండ్ లభిస్తుందని కాయిట్ అంచనా వేస్తోంది. దిల్లీ జాతీయ రాజధాని ప్రాంతంలోనే సుమారు 5 లక్షల వివాహాలు జరగనున్నాయని, వీటి ద్వారా దాదాపు రూ.2.5 లక్షల కోట్ల వ్యాపారం జరిగే అవకాశం ఉందని కాయిట్ పరిశోధన విభాగం సీఏఐటీ రీసెర్చ్ అండ్ ట్రేడ్ డెవలప్‌మెంట్ సొసైటీ పేర్కొంది. 25 రాష్ట్రాలకు చెందిన 300 మందికి పైగా వ్యాపార ప్రముఖులు, 550 వ్యాపార సంఘాలతో సంప్రదింపులు జరిపి, దేశవ్యాప్త అంచనాలు రూపొందించినట్లు సంస్థ వెల్లడించింది. మొత్తం రూ.7.5 లక్షల కోట్ల వ్యాపారంలో వస్తువులు, రిటెయిల్ కొనుగోళ్ల ద్వారా సుమారు రూ.4.05 లక్షల కోట్లు (54%).. సేవల ద్వారా రూ.3.45 లక్షల కోట్ల (46%) వ్యాపారం జరగొచ్చు.

వస్తువుల్లో బంగారు ఆభరణాలు, ఇతర లోహాల కొనుగోళ్లు రూ.1.2 లక్షల కోట్ల మేర; వస్త్ర వ్యాపారం రూ.90,000 కోట్ల మేర జరగనుంది. బహుమతులు, వివాహాలకు అవసరమైన అలంకరణ వస్తువులు, కిరాణా సరుకులు, ఆహార పదార్థాల విభాగాలు ఒక్కోదానిలో రూ.37,500 కోట్ల చొప్పున వ్యాపారం జరుగుతుందని అంచనా వేసింది. ఎలక్ట్రానిక్ వస్తువులు, డ్రైఫ్రూట్స్, మిఠాయిలు, ఫర్నిచర్, గృహోపకరణాల విభాగాల్లో ఒక్కో రంగం ద్వారా రూ.30,000 కోట్ల చొప్పున వ్యాపారం జరిగే అవకాశం ఉందని తెలిపింది. సేవల రంగంలో క్యాటరింగ్ ద్వారా రూ.75,000 కోట్లు; వివాహ వేదికలు, ఫంక్షన్ హాళ్లు, హోటళ్ల ద్వారా రూ.60,000 కోట్ల వ్యాపారం జరగనుంది. ఈవెంట్ మేనేజ్‌మెంట్, వివాహ ప్రణాళిక సేవలు, పూల అలంకరణ, వివాహ వేడుకల అలంకరణ విభాగాల్లో ఒక్కో రంగం ద్వారా రూ.37,500 కోట్ల చొప్పున వ్యాపారం జరుగుతుందని తెలిపింది. ప్రయాణం, రవాణా సేవలు, సంగీతం, వినోద కార్యక్రమాల ద్వారా ఒక్కో విభాగంలో రూ.30,000 కోట్ల చొప్పున వ్యాపారం జరిగే అవకాశం ఉంది. ఫొటోగ్రఫీ, వీడియో చిత్రీకరణ, వ్యక్తిగత అలంకరణ సేవల ద్వారా ఒక్కో విభాగంలో రూ.22,500 కోట్ల చొప్పున ఆదాయం సమకూరుతుందని సంస్థ అంచనా వేసింది.

1.25 కోట్ల మందికి తాత్కాలిక ఉపాధి

ఇంత భారీ వేడుకల వల్ల 1.25 కోట్ల మందికి తాత్కాలిక ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయని కాయిట్ తెలిపింది. క్యాటరింగ్, అలంకరణ, ఫొటోగ్రఫీ, ఆతిథ్య రంగం, రవాణా, ఈవెంట్ మేనేజ్‌మెంట్, వ్యక్తిగత అలంకరణ సేవల్లో ఈ ఉపాధి లభించనుంది.

రేఖానాయక్ ఇళ్లపై ఈడీ మెరుపు దాడులు

ముద్ర, హైదరాబాద్ :

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్‌కు సంబంధించి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కుంభకోణం కేసులో ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఈ ఉదయం ఖానాపూర్‌తో పాటు హైదరాబాద్‌లోని ఆమె నివాసాల్లో ఈడీ ఏకకాలంలో ముమ్మర సోదాలు చేపట్టింది.

ఖానాపూర్ మండలం సత్తెనపల్లి వద్ద రేఖానాయక్‌కు చెందిన ఏఆర్ఎస్ అగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లుకు ప్రభుత్వం మిల్లింగ్ నిమిత్తం ధాన్యాన్ని కేటాయించింది. అయితే, 2022–23, 2023–24, 2024–25 రబీ సీజన్లకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన ధాన్యంలో పెద్ద మొత్తంలో బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పగించకుండా పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీని విలువ మార్కెట్‌లో సుమారు రూ.40.96 కోట్లు ఉంటుందని పౌరసరఫరాల శాఖ గుర్తించింది.

గత ఆగస్టు నెలలో విజిలెన్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో భారీగా ధాన్యం నిల్వలు మాయమైనట్లు తేలింది. దీనిపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఫిర్యాదు చేయడంతో ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. ఈ కేసు ఆధారంగా మనీ లాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టిన ఈడీ అధికారులు తాజాగా రంగంలోకి దిగి సోదాలు చేస్తున్నారు.

ప్రస్తుతం ఖానాపూర్‌లోని రేఖానాయక్ నివాసం వద్ద విజిలెన్స్, స్థానిక పోలీసు బలగాలు భారీగా మోహరించాయి. నివాసాల్లో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు, విచారణ అనంతరం ఆమెను అదుపులోకి తీసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

స్టాక్ మార్కెట్‌లోకి ఏపీఎండీసీ

ముద్ర, అమరావతి :

రాష్ట్ర ఖనిజ సంపదను భవిష్యత్ తరాలకు విలువైన ఆస్తిగా మలచడమే లక్ష్యంగా ముందుకెళ్లాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఏపీఎండీసీని ఎన్ఎండీసీ తరహాలో అత్యున్నత స్థాయి మైనింగ్ సంస్థగా తీర్చిదిద్దాలని దిశానిర్దేశం చేశారు. ఇందుకోసం అవసరమైతే ప్రైవేట్ ఏజెన్సీల సహకారం తీసుకోవాలని సూచించారు. ఖనిజ వనరులను కేవలం ఆదాయార్జనకు పరిమితం చేయకుండా.. వాటి విలువను పెంచి రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి వినియోగించాలని స్పష్టం చేశారు.

గనుల శాఖపై ముఖ్యమంత్రి.. అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో కొత్త ఖనిజ నిక్షేపాల గుర్తింపు, వాటి సమర్థ వినియోగం, ఆదాయార్జన అవకాశాలపై చర్చించారు. రాష్ట్రంలోని ఖనిజ వనరులు ఇక్కడే వినియోగంలోకి వచ్చేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఖనిజ అన్వేషణ, వేలం ప్రక్రియను వేగవంతం చేసేందుకు వచ్చే ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని ఆదేశించారు. ఏపీఎండీసీని స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేసేందుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఐపీఓకు వెళ్లేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. సంస్థ ఈక్విటీ విలువ ఆధారంగా ఐపీఓ ప్రక్రియ చేపట్టాలని నిర్దేశించారు. ఈ మేరకు ప్రతిపాదనలను అధికారులు సమర్పించారు.


కీలక ఖనిజాల అన్వేషణ, నిర్వహణకు ప్రత్యేక సంస్థ ఏర్పాటు కానుంది. ఏపీ రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం ఆమోదం తెలిపారు. రేర్ ఎర్త్ ఖనిజాల అన్వేషణతో పాటు.. వాటికి అదనపు విలువ కల్పించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఖనిజ నిక్షేపాల గుర్తింపునకు ఆధునిక పద్ధతులు వినియోగిస్తున్నారు. 74,860 చదరపు కిలోమీటర్ల పరిధిలో 582 మినరల్ పొటెన్షియల్ ఏరియాలను గుర్తించారు. వీటిని 209 క్లస్టర్లుగా విభజించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పెండింగ్‌లో ఉన్న క్వారీ లీజు దరఖాస్తులు, రెన్యువల్స్ పరిష్కారంపైనా సమీక్షలో చర్చించారు. 6,500 క్వారీ లీజు దరఖాస్తులు, 223 రెన్యువల్స్ పెండింగ్‌లో ఉన్నాయి. వీటి పరిష్కారానికి గడువు పొడిగించే ప్రతిపాదనలను అధికారులు సీఎం పరిశీలనకు తీసుకొచ్చారు. ఈ దరఖాస్తులు, రెన్యువల్స్ పరిష్కారమైతే ప్రభుత్వానికి సుమారు రూ.400 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

తెలంగాణ విద్యా వ్యవస్థకు పండుగ రోజు

ముద్ర, హైదరాబాద్ :

చదువుల తల్లి చల్లని ఒడిలో ఎదిగే వారికి ఎల్లలు లేవని నిరూపించిన ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య వందో జన్మదినం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా మంత్రులు, వివిధ పార్టీల నేతలు శుభాకాంక్షలు తెలియజేశారు. చుక్కా రామయ్య వందో జన్మదినం తెలంగాణ విద్యా వ్యవస్థకు పండుగ రోజని సీఎం రేవంత్ అన్నారు. ఐఐటీ అనే పదాన్ని తెలుగు విద్యార్థుల చెంతకు చేర్చడమే కాకుండా.. వేలాది మంది ఐఐటీ కలను సాకారం చేసిన మహనీయుడన్నారు. విద్యావేత్తగానే కాకుండా ఎమ్మెల్సీగా తనదైన ముద్ర వేశారని సీఎం కొనియాడారు. సామాజిక సమస్యలతో పాటు ప్రజా సమస్యలపై పదునైన ప్రశ్నలతో ప్రభుత్వాన్ని నిలదీసి, పరిష్కారం ఏ విధంగా ఉండాలో సూచించేవారని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వం ఆయన సూచనలతో ముందుకు వెళ్తుందని తెలిపారు. అంతకు ముందు మంత్రి జూపల్లి, కేటీఆర్, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్సీ కోదండరాం, బండారు, ఈనాడు ఎడిటర్ నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలియజేశారు.

మగశిశువుకు జన్మనిచ్చిన సమంత



ముద్ర, హైదరాబాద్ :

ప్రముఖ నటి సమంత మాతృత్వపు మధురిమలను ఆస్వాదిస్తున్నారు. ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని సమంత, ఆమె భర్త, ప్రముఖ దర్శకుడు రాజ్ నిడిమోరు స్వయంగా సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. బాబు చిన్ని వేళ్లు సమంత వేలిని పట్టుకున్న అపురూపమైన చిత్రాన్ని పంచుకుంటూ తమ కుమారుడి పేరును 'దేవ్ నిడిమోరు'గా ఖరారు చేసినట్లు ప్రకటించారు. 2026 నవంబరు 19న తమ బాబు జన్మించాడని, ఈ సమయం తమ జీవితంలోనే అత్యంత ఆనందకరమైన క్షణమని ఈ జంట భావోద్వేగంతో రాసుకొచ్చారు.

బాబు రాకకు ముందే, నవంబరు 17న వీరి ఇంట్లో కుటుంబ సభ్యుల సమక్షంలో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. తల్లీబిడ్డల ఆరోగ్యం, సుఖ ప్రసవం కోసం 'మాతృ శిశు మంగళ ఆశీర్వాదం' పేరుతో వేడుక జరిగింది. ఈ పూజలో సమంత ఎరుపు రంగు సాంప్రదాయ దుస్తుల్లో మెరవగా, రాజ్ క్రీమ్ కలర్ కుర్తా, తెల్లటి పైజామాలో కనిపించారు. కుటుంబ పెద్దల ఆశీర్వాదం తీసుకుంటూ, శ్రీసూక్తం, గాయత్రీ దేవి హోమంలో వారు పాల్గొన్నారు.

ఈ వేడుక విశేషాలను రాజ్ సోదరి సోషల్ మీడియాలో పంచుకున్నారు. కుటుంబంలోని పిన్నమ్మలు, పెద్దమ్మలు అందరూ ఒకచోట చేరి సమంతకు, పుట్టబోయే బిడ్డకు దీవెనలు అందించారని ఆమె పేర్కొన్నారు. పద్మశ్రీ శోభారాజు ప్రత్యేకంగా స్వరపరిచిన గీతాన్ని కుటుంబ సభ్యులు ఆలపించి వేడుకను మరింత ఘనంగా మార్చారు.

సమంత, రాజ్‌లు 2025 డిసెంబరు 1న కోయంబత్తూరులోని ఇషా యోగా సెంటర్ లింగ భైరవి ఆలయంలో అత్యంత సన్నిహితుల మధ్య వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. 'ది ఫ్యామిలీ మ్యాన్ 2', 'సిటాడెల్: హనీ బన్నీ', 'మా ఇంటి బంగారం' వంటి చిత్రాల్లో వీరిద్దరూ కలిసి పనిచేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 21.11.2026
www.mudranews.in | @mudranews

మెదడు ఆరోగ్యానికి ఉపయోగకరం



కొత్తిమీరలోని యాంటీఆక్సిడెంట్లు మెదడు కణాలను ఆక్సీకరణ ఒత్తిడి నుంచి రక్షించడంలో తోడ్పడవచ్చు. కొన్ని పరిశోధనల్లో జ్ఞాపకశక్తి, ఆందోళనకు సంబంధించిన అంశాల్లో సానుకూల ఫలితాలు కనిపించాయి. అయితే దీనిపై మరిన్ని మానవ అధ్యయనాలు అవసరం.

ఎఫ్ఎన్సీసీ మీడియా కమిటీ చైర్మన్‌గా
కె. సత్యనారాయణ నియామకం

- సీనియర్ జర్నలిస్టు, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు కె. సత్యనారాయణకు కీలక బాధ్యతలు

- ఎఫ్ఎన్సీసీ ప్రతిష్ఠ పెంపునకు ప్రత్యేక కార్యాచరణ



ముద్ర, హైదరాబాద్: ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్ఎన్సీసీ) మీడియా, వెబ్ సైట్, న్యూస్ లెటర్ సబ్ కమిటీ చైర్మన్ గా ప్రముఖ జర్నలిస్టు కె. సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు ఎఫ్ఎన్సీసీ మేనేజ్ మెంట్ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్న కె. సత్యనారాయణకు ఈ బాధ్యతలు అప్పగిస్తూ ఎఫ్ఎన్సీసీ అధ్యక్షుడు కె.ఎస్. రామారావు, సెక్రటరీ ముళ్లపూడి మోహన్ అధికారికంగా నియామక ఉత్తర్వులు జారీ చేశారు. మీడియా, వెబ్ సైట్, మాసపత్రిక న్యూస్ లెటర్ ద్వారా సంస్థ సమాచారాన్ని మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడంతో పాటు, ఎఫ్ఎన్సీసీ ప్రతిష్ఠను పెంపొందించే దిశగా ఆయన సూచనలు, భాగస్వామ్యం అందించాలని మేనేజ్ మెంట్ కమిటీ ఆకాంక్షించింది.

ఈ నియామకంపై పలువురు ప్రముఖులు, జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. కె. సత్యనారాయణకు అభినందనలు తెలియజేస్తూ ఆయన నాయకత్వంలో ఎఫ్ఎన్సీసీ మీడియా విభాగం మరింత క్రియాశీలకంగా పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

శ్రీ సత్యసాయి జిల్లా తొలి జడ్పీ చైర్మన్‌గా పరిటాల శ్రీరామ్



ముద్ర, పుట్టపర్తి: శ్రీ సత్యసాయి జిల్లా తొలి జిల్లా పరిషత్ చైర్మన్‌గా టీడీపీ నేత పరిటాల శ్రీరామ్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, కూటమి నాయకుల సమక్షంలో రెవెన్యూ భవన్‌లో ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది. జనసేనకు చెందిన గోరంట్ల జడ్పీటీసీ సభ్యురాలు సునేత్ర వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు వెంకటాపురంలోని పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద శ్రీరామ్ నివాళులర్పించారు. తన తండ్రి ఆశయాలు, తల్లి పరిటాల సునీత స్ఫూర్తితో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తానని శ్రీరామ్ ప్రకటించారు. మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కందికుంట వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ధర్మవరంలో శ్రీరామ్‌కు ఘన స్వాగతం పలుకుతూ అభిమానులు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

ముద్ర, హైదరాబాద్: తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026 ఏర్పాట్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శుక్రవారం పరిశీలించారు. గచ్చిబౌలి, యూసుఫ్‌గూడ స్టేడియంలను సందర్శించి క్రీడా మౌలిక వసతులు, క్రీడాకారులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో సమీక్షించారు. భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, రవాణా తదితర ఏర్పాట్లను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. దేశవ్యాప్తంగా వచ్చే క్రీడాకారులకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పిస్తూ, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాట్ ఎండీ సోనీ బాలా తదితర అధికారులు పాల్గొన్నారు.

బాచుపల్లి లేఅవుట్ ఈ-వేలం.. రూ.55.43 కోట్ల ఆదాయం

ముద్ర, హైదరాబాద్: బాచుపల్లి లేఅవుట్‌లో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిర్వహించిన ఈ–వేలం విజయవంతమైంది. ఈ వేలం ద్వారా హెచ్ఎండీఏకు రూ.55.43 కోట్ల ఆదాయం సమకూరింది. మొత్తం 50 ప్లాట్లను వేలానికి ఉంచగా, 40 ప్లాట్లు విజయవంతంగా విక్రయమయ్యాయి. ఈ–వేలంలో గరిష్టంగా చదరపు గజానికి రూ.60,500 ధర పలికింది. చదరపు గజానికి వెయిటెడ్ యావరేజ్ ధర రూ.49,737గా నమోదైంది. బాచుపల్లి ప్రాంతంలో ప్లాట్లకు ఉన్న డిమాండ్‌ను ఈ వేలం స్పష్టం చేసింది.

మెడికల్ టూరిజంలో హైదరాబాద్‌ను గ్లోబల్ హబ్

- మంత్రి దామోదర్



ముద్ర, హైదరాబాద్: మెడికల్ టూరిజంలో హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి గ్లోబల్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్య రంగాల సమన్వయంతో ప్రపంచస్థాయి వైద్య సేవలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. గురువారం సచివాలయంలో నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ హెల్త్‌కేర్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సనత్‌నగర్ టిమ్స్, నిమ్స్, అల్వాల్ టిమ్స్, కొత్తపేట టిమ్స్ ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం వార్డులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ వైద్యులకు జాయింట్ రీప్లేస్‌మెంట్, న్యూరో సర్జరీ, కార్డియో థొరాసిక్ సర్జరీ వంటి విభాగాల్లో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ప్రైవేటు వైద్యులు ముందుకొచ్చారని తెలిపారు. వారి సేవలను వినియోగించుకుంటామని మంత్రి చెప్పారు. ప్రతి జిల్లాలో కీమోథెరపీ కేంద్రాల ఏర్పాటు, డయాలసిస్ సేవల విస్తరణపై ప్రైవేటు వైద్యులు ప్రభుత్వాన్ని అభినందించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఫార్మా వైస్ ప్రెసిడెంట్, కౌన్సిల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కొండపల్లి సాహితి, కిమ్స్–సన్‌షైన్ ఎండీ డాక్టర్ గురువా రెడ్డి, ఫిక్కీ మెంబర్ సర్జన్ కెప్టెన్ డాక్టర్ విజయ్ కుమార్, రెయిన్‌బో హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రశాంత్, ఐక్యరాజ్యసమితి మాజీ అధికారి డాక్టర్ శివ దుబిశెట్టి, యశోద హాస్పిటల్ ప్రతినిధి డాక్టర్ దశరథ రామిరెడ్డి పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు రోజుకు అదనంగా 40 ఎంజీడీల గోదావరి జలాలు

ముద్ర, హైదరాబాద్ : నగర తాగునీటి అవసరాల కోసం మల్లన్నసాగర్ నుంచి ఘన్‌పూర్ మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు రోజుకు అదనంగా 40 ఎంజీడీల గోదావరి జలాలను తరలించేందుకు చేపట్టిన పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ నెల 21 నాటికి పైప్‌లైన్ అనుసంధాన పనులు పూర్తి చేసి ట్రయల్ రన్ ప్రారంభించేందుకు జలమండలి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, మిషన్ భగీరథ అధికారులతో కలిసి పనులను పరిశీలించి, మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

డిఫాల్టర్ రైస్ మిల్లర్లకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

మిల్లర్ల పిటిషన్లు కొట్టివేత.. బకాయి సీఎంఆర్ బియ్యం వెంటనే అప్పగించాలని ప్రభుత్వ ఆదేశం

ముద్ర, హైదరాబాద్ : తెలంగాణలో డిఫాల్టర్ రైస్ మిల్లర్లకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తమపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేయాలని కోరుతూ కొందరు మిల్లర్లు దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇప్పటికే మే 2026లో తెలంగాణ హైకోర్టు కూడా మిల్లర్ల పిటిషన్లను తిరస్కరించగా, తాజాగా సుప్రీంకోర్టు తీర్పుతో ప్రభుత్వ చర్యలకు మరింత బలం చేకూరింది.ప్రభుత్వం కేటాయించిన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌కు తరలించి, ఒప్పందం ప్రకారం అందించాల్సిన



కస్టమ్ మిల్లింగ్ రైస్ (CMR) బియ్యాన్ని సరఫరా చేయని మిల్లర్లపై 2024 నుంచి చర్యలు ప్రారంభమయ్యాయి. ఆకస్మిక తనిఖీల్లో అక్రమాలు వెలుగుచూడటంతో రాష్ట్రవ్యాప్తంగా 540 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.

ఈ నేపథ్యంలో డిఫాల్టర్ మిల్లర్లందరూ తక్షణమే బకాయి సీఎంఆర్ బియ్యాన్ని పౌర సరఫరాల సంస్థకు అందించాలని లేదా బకాయిలను చెల్లించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ధాన్యం దుర్వినియోగం, పీడీఎస్ బియ్యం అక్రమాలపై జీరో టాలరెన్స్ విధానం కొనసాగుతుందని హెచ్చరించింది. అవసరమైతే రెవెన్యూ రికవరీ చట్టం కింద కూడా చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. మిల్లర్ల న్యాయమైన సమస్యలను చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వ ధాన్యం అక్రమ మళ్లింపును మాత్రం సహించబోమని స్పష్టం చేసింది.

22, 23 తేదీల్లో ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ సందీప్ పర్యటన

ముద్ర, హైదరాబాద్: ఏఐసీసీ తెలంగాణ ఇన్‌ఛార్జ్ సందీప్ ఈనెల 22, 23 తేదీల్లో తెలంగాణలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా గాంధీభవన్‌లో పార్టీ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులతో పలు సమావేశాల్లో పాల్గొననున్నారు. ఈనెల 22న ఉదయం గాంధీభవన్‌లో జరిగే పీఏసీ, టీపీసీసీ సలహా కమిటీ ఉమ్మడి సమావేశానికి సందీప్ హాజరవుతారు. అదే రోజు మధ్యాహ్నం నిర్వహించే టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొంటారు.23న ఉదయం మంత్రులతో వన్ టు వన్ సమావేశాలు నిర్వహించ నున్నారు. మధ్యాహ్నం నుంచి డీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులతో విడివిడిగా భేటీ కానున్నారు. మరోసారి ఈనెల 27న తెలంగాణకు రానున్న సందీప్.. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల తో సమావేశాలు నిర్వహించను న్నారు.

ఉత్తమ నటుడు రణ్‌వీర్..
'ధురంధర్'కు అవార్డుల మోత..

ముద్ర, న్యూఢిల్లీ : దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026 అవార్డులను శుక్రవారం ప్రకటించారు. రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా ఆదిత్యధర్ దర్శకత్వంలో వచ్చిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' అవార్డుల మోత మోగించింది. ఉత్తమ నటుడి అవార్డు రణవీర్ సింగ్‌ను వరించింది. ఇక 'సయారా'లో నటనకు గానూ ఉత్తమ నటి అవార్డును అనీత్ పడ్డా సొంతం చేసుకుంది. ఉత్తమ చిత్రంగా 'ధురంధర్' నిలిచింది. ఇంటర్నేషనల్ ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ప్రముఖ గాయని టేలర్ స్విఫ్ట్ ఎంపికయ్యారు.

గ్రామీణ రహదారుల అభివృద్ధికి డిజిటల్ టెక్నాలజీ

ముద్ర, హైదరాబాద్ : గ్రామీణ రహదారుల అభివృద్ధి పనులకు ప్రాధాన్యత క్రమాన్ని శాస్త్రీయంగా నిర్ణయించేందుకు రూపొందించిన వినూత్న డిజిటల్ సాఫ్ట్‌వేర్‌ను హైదరాబాద్‌లో జరుగుతున్న 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్‌లో ప్రదర్శించారు. ముంబై సర్దార్ పటేల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ ప్రశాంత్ పి. నాగ్రాలే, పరిశోధక విద్యార్థి ప్రవీణ్‌కుమార్ ఎన్. జాగ్టాప్ ఈ సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేశారు. SQLite డేటాబేస్ ఆధారంగా రూపొందించిన PP25 సాఫ్ట్‌వేర్ ద్వారా గ్రామీణ రహదారుల ఎంపిక, ప్రాధాన్యత క్రమాన్ని ఆటోమేటిక్‌గా నిర్ణయించవచ్చు. జనాభా, రహదారి అనుసంధానం, విద్య, వైద్యం, మార్కెట్లు, ఇతర మౌలిక సదుపాయాలకు ప్రజలకు ఉన్న ప్రాప్యత వంటి అంశాలను ఇది పరిగణనలోకి తీసుకుంటుంది. మహారాష్ట్రలోని థానే జిల్లా అంబర్‌నాథ్ ప్రాంతంలో 25 గ్రామీణ రహదారులపై ఈ సాఫ్ట్‌వేర్‌ను పరీక్షించారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన మార్గదర్శకాల్లోని యుటిలిటీ వాల్యూ, నెట్‌వర్క్ పనితీరు సూచీ అనే రెండు పద్ధతుల ద్వారా పరిశీలన నిర్వహించారు. రెండు పద్ధతుల ఫలితాల్లోనూ మంచి సారూప్యత కనిపించింది. అత్యధిక ప్రాధాన్యత కలిగిన ఐదు రహదారులను రెండూ ఒకే విధంగా గుర్తించాయి.పరిమిత నిధులతో గ్రామీణ రహదారుల అభివృద్ధి పనులను సమర్థవంతంగా చేపట్టేందుకు ఈ సాఫ్ట్‌వేర్ ఉపయోగపడనుంది. ప్రాజెక్టుల ఎంపికలో పారదర్శకత పెంచడంతో పాటు సమయం ఆదా చేయడానికి, బడ్జెట్ కేటాయింపుల్లో సరైన ప్రాధాన్యత నిర్ణయించడానికి ఇది దోహదపడుతుందని పరిశోధకులు వెల్లడించారు.

23న కరీంనగర్‌కు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాక

లక్ష మందితో మహా పాదయాత్రకు బీజేపీ భారీ ఏర్పాట్లు

ముద్ర, కరీంనగర్: బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఈనెల 23న తొలిసారిగా కరీంనగర్‌కు రానున్నారు. ఈ సందర్భంగా 'ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం – అరాచకత్వాన్ని పాతరేద్దాం' అనే నినాదంతో భారీ మహా పాదయాత్ర నిర్వహించనున్నారు. కనీసం లక్ష మందిని సమీకరించేలా బీజేపీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోజు ఉదయం 11 గంటలకు హైదరాబాద్ చేరుకోనున్న నితిన్ నబీన్.. ప్రత్యేక హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 12 గంటలకు కరీంనగర్ చేరుకుంటారు. అనంతరం వైశ్యా భవన్ నుంచి టవర్ సర్కిల్, శాస్త్రీ రోడ్డు మీదుగా కమాన్ వరకు జరిగే మహా పాదయాత్రలో పాల్గొంటారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, రాష్ట్ర ఇన్‌ఛార్జి సునీల్ బన్సల్, సహ ఇన్‌ఛార్జీలు రేఖాశర్మ, అభయ్ పాటిల్ తదితరులు పాల్గొంటారు.

'సర్' పేరిట ఎన్నికల సంఘం, ఇతర రాజ్యాంగ సంస్థలపై విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, ప్రజలకు వాస్తవాలు వివరించడమే ఈ పాదయాత్ర ప్రధాన ఉద్దేశమని బీజేపీ నేతలు తెలిపారు. మహా పాదయాత్ర విజయవంతానికి బండి సంజయ్ కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీల నుంచి



భారీగా కార్యకర్తలు, ప్రజాస్వామ్యవాదులు తరలివచ్చేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్ బూత్ స్థాయి నుంచి ప్రచారం చేపట్టాలని, మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు.

నితిన్ నబీన్ రాకతో కరీంనగర్ పేరు దేశవ్యాప్తంగా మారుమోగేలా మహా పాదయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని బండి సంజయ్ తెలిపారు. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు కూడా పాదయాత్రను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఎల్ నినో ను ఎదుర్కొనే శక్తిని ఇవ్వండి..

ప్రభుత్వ సూచనలు ప్రజలు తప్పకుండా పాటించాలి..
కొండగట్టు అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతాం..
రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్..
కొండగట్టు అంజన్న ను దర్శించుకున్న స్పీకర్, మంత్రి అడ్లూరి ఎమ్మెల్యేలు..



ముద్ర, కొండగట్టు: ఎల్ నినోను ఎదుర్కొనే శక్తిని ప్రజా ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి అందించాలని కొండగట్టులోని ఆంజనేయ స్వామిని వేడుకున్నట్టు రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం చైర్మన్ నర్సింగరావు, జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి కొండగట్టు ఆంజనేయ స్వామిని స్పీకర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, ఆలయ అర్చకులు స్పీకర్ తో పాటు మంత్రి లక్ష్మణ్ కుమార్ కు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ప్రపంచానికి సవాలుగా మారిన ఎల్ నినో ను సమర్థవంతంగా ఎదుర్కొనే శక్తిని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ప్రజా ప్రభుత్వానికి అందించాలని కొండగట్టు ఆంజనేయ స్వామిని కోరుకున్నట్లు స్పీకర్ తెలిపారు. 60 ఏళ్లకు ఒకసారి జరిగే చందనోత్సవములో పాల్గొనడం అదృష్టమని స్పీకర్ అన్నారు. కొండగట్టు ప్రాంత అభివృద్ధికి ముఖ్యమంత్రి గారితో మాట్లాడి ప్రత్యేక నిధులు సాధిస్తామని స్పీకర్ తెలిపారు.

నిజరూప దర్శనం అదృష్టం.. : మంత్రి లక్ష్మణ్ కుమార్..

కొండగట్టులో స్వయంభుగా వెలసిన ఆంజనేయ స్వామి చందనోత్సవములో పాల్గొనడం స్వామివారి నిజరూప దర్శనం చేసుకోవడం గత జన్మలో చేసుకున్న పుణ్యంగా భావిస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుతూ ఆలయాల విశిష్టతను భవిష్యత్ తరాలకు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర నుండి భద్రాచలం వరకు కోట్ల రూపాయలు వెచ్చించి ఆలయాలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తో పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్ గారి సహకారంతో కొండగట్టు ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక నిధులు సాధిస్తామని మంత్రి తెలిపారు.

గోదావరి పుష్కరాలు–2027 లోగో, ట్యాగ్‌లైన్ రూపకల్పనకు పోటీలు

విజేతలకు రూ.లక్ష, రూ.50 వేలు, రూ.25 వేల నగదు బహుమతులు

ముద్ర, హైదరాబాద్ : తెలంగాణలో 2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి అధికారిక లోగో, ట్యాగ్‌లైన్ రూపకల్పన కోసం రాష్ట్ర దేవాదాయ శాఖ పోటీలు నిర్వహిస్తోంది. ఈ పోటీల్లో పాల్గొని సృజనాత్మక ఆలోచనలతో ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చేలా లోగో, ట్యాగ్‌లైన్ రూపొందించాలని వ్యక్తులు, సృజనాత్మక బృందాలకు ఆహ్వానం పలికింది.ప్రతి 12 ఏళ్లకు ఒకసారి జరిగే గోదావరి పుష్కరాలను తెలంగాణలోని ఎనిమిది గోదావరి నదీ తీర జిల్లాల్లో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో గోదావరి నది ఆధ్యాత్మిక ప్రాధాన్యత, పుష్కరాల సంప్రదాయాలు ప్రతిబింబించేలా లోగో ఉండాలని, ట్యాగ్‌లైన్ సంక్షిప్తంగా, ఆకట్టుకునేలా, భక్తులకు సులభంగా గుర్తుండేలా ఉండాలని నిర్వాహకులు సూచించారు.18 ఏళ్లు నిండిన వ్యక్తులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. గరిష్ఠంగా ముగ్గురు సభ్యులతో కూడిన బృందాలు కూడా తమ ఎంట్రీలను పంపవచ్చు. ప్రతి ఎంట్రీలో లోగోతో పాటు తెలుగు, ఇంగ్లీష్ లేదా రెండు భాషల్లో ట్యాగ్‌లైన్, లోగో రూపకల్పన వెనుక ఉన్న ఆలోచనకు సంబంధించిన వివరణ తప్పనిసరిగా ఉండాలి.

నగదు బహుమతులు ఇలా

మొదటి బహుమతి విజేతకు రూ.1,00,000, రెండో బహుమతి విజేతకు రూ.50,000, మూడో బహుమతి విజేతకు రూ.25,000 అందజేయనున్నారు. మొదటి మూడు బహుమతులు పొందిన వారితో పాటు ఎంపికైన టాప్ 100 ఎంట్రీలకు ప్రశంసాపత్రాలు అందజేస్తారు. పోటీలో పాల్గొనాలనుకునే వారు తమ ఎంట్రీలను నవంబర్ 30, 2026 సాయంత్రం 5 గంటల్లోగా godavaripushkaralutg@gmail.com ఈమెయిల్‌కు పంపాలి. లేదా హైదరాబాద్‌లోని బొగ్గులకుంట, తిలక్ రోడ్డులో ఉన్న దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో డైరెక్టర్, దేవాదాయ శాఖ శ్రీ ఎం. హనుమంతరావు, ఐఏఎస్ పేరిట పోస్టు ద్వారా పంపవచ్చు.

పోటీకి సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు, నిబంధనలు తెలంగాణ దేవాదాయ శాఖ అధికారిక వెబ్‌సైట్ https://endowments.ts.nic.in/ లో అందుబాటులో ఉన్నాయి. ఇదిలా ఉండగా, దేవాదాయ శాఖ జేఎన్ఏఎఫ్ఏయూ (JNAFAU), హైదరాబాద్ సహకారంతో నవంబర్ 23, సోమవారం ఉదయం 10.30 గంటలకు మాసాబ్ ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో లోగో, ట్యాగ్‌లైన్ రూపకల్పనపై ప్రత్యేక పోటీ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. విద్యార్థులతో పాటు ఆసక్తి ఉన్న ఇతర సృజనాత్మక వ్యక్తులు కూడా ఇందులో పాల్గొనవచ్చని దేవాదాయ శాఖ కమిషనర్ తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews

శనివారం,
21 నవంబర్, 2026

4 వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మెయిల్: mudradaily@gmail.com

నెల పాటు ఆల్కహాల్ మానేస్తే

శరీరంలో జరిగే మార్పులు!

ఆల్కహాల్ ఆరోగ్యానికి మంచిది కాదని తెలిసినా చాలా మంది ఆ వ్యసనాన్ని వదులుకోరు. అయితే ఒక నెలపాటు ఆల్కహాల్‌కు దూరంగా ఉండటం వల్ల శరీరంలో జరిగే మార్పుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

30 రోజుల్లో అద్భుతమైన మార్పు

కేవలం 30 రోజులు ఆల్కహాల్ తాగడం మానేయడం మీ జీవితంలో గణనీయమైన సానుకూల మార్పులను తీసుకురాగలదు. ఈ చిన్న ప్రయత్నం మీ శరీరంపై, ముఖ్యంగా కాలేయంపై కలిగే ఒత్తిడిని తగ్గిస్తుంది. మీ నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది, మానసిక స్థితిలో స్పష్టమైన మార్పు కనిపిస్తుంది. చాలా మంది మొదటి వారంలోనే శక్తి స్థాయిలు పెరిగినట్లు, చర్మం ప్రకాశవంతంగా మారినట్లు గమనిస్తారు. ఒక నెలలో, మీ శరీరం విషాన్ని తొలగించుకుని, కొత్త శక్తితో నిండిపోతుంది. వైద్య నిపుణులు కూడా ఈ నిర్ణయాన్ని ప్రశంసిస్తారు, ఎందుకంటే ఇది దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను నివారించడానికి ఇది మొదటి అడుగు.

ఆల్కహాల్ విరామంతో లాభాలు

ఆల్కహాల్ మానేసిన నెల రోజుల్లో కాలేయం తనను తాను పునరుద్ధరించుకోవడం ప్రారంభిస్తుంది. ఆల్కహాల్ వల్ల కాలేయంపై పడే ఒత్తిడి తగ్గి, కొవ్వు నిల్వలు క్రమంగా తగ్గుతాయి, ఇది ఫ్యాటీ లివర్ రిస్క్‌ను తగ్గిస్తుంది. వైద్య అధ్యయనాల ప్రకారం, 30 రోజుల పాటు ఆల్కహాల్‌ను దూరంగా ఉంచిన వారికి కాలేయ ఎంజైమ్‌ల స్థాయిలు మెరుగుపడతాయి. ఇది కేవలం కాలేయానికి మాత్రమే కాదు, గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. రక్తపోటు సాధారణ స్థాయికి వస్తుంది, గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. గుండె మరింత సమర్థంగా పనిచేస్తుంది.

నిద్ర, మానసిక స్థితి, బరువు

ఆల్కహాల్‌ను మానేయడం వల్ల నిద్ర నాణ్యతలో గణనీయమైన మెరుగుదల కనిపిస్తుంది. మందు మొదట్లో నిద్రకు సహాయపడినట్లు అనిపించినా, అది లోతైన నిద్ర దశలకు ఆటంకం కలిగిస్తుంది. 30 రోజుల తర్వాత, మీరు ఎక్కువసేపు గాఢ నిద్రను అనుభవిస్తారు, ఉదయం తాజాగా మేల్కొంటారు. మానసిక ఆందోళన, డిప్రెషన్ లక్షణాలు తగ్గుతాయి, మీ మానసిక స్పష్టత పెరుగుతుంది. అంతేకాకుండా, ఆల్కహాల్‌లో కేలరీలు అధికంగా ఉంటాయి, వాటిని నివారించడం వల్ల బరువు తగ్గడంలో సహాయపడుతుంది. సగటున, ఒక వ్యక్తి నెలకు 1-2 కిలోల బరువు తగ్గే అవకాశం ఉంది. మీ శరీరం దృఢంగా మారుతుంది.

డబ్బులు ఆదా చేసుకోవచ్చు

మందు మానేయడం కేవలం ఆరోగ్యానికి మాత్రమే కాదు, మీ ఆర్థిక స్థితికి కూడా చాలా లాభదాయకం. ఆల్కహాల్ అనేది ఖరీదైన అలవాటు; రెస్టారెంట్లు, బార్‌లలో తాగేందుకు లేదా ఇంట్లో నిల్వ ఉంచుకోవడానికి చాలా డబ్బు ఖర్చవుతుంది. సాధారణంగా, ఒక నెలలో మందు కోసం చేసే ఖర్చు గణనీయంగా ఉంటుంది. ఉదాహరణకు, సగటు మందుబాబు నెలకు రూ. 5,000 నుంచి రూ. 15,000 వరకు ఖర్చు చేస్తుంటారని అంచనా. ఈ ఖర్చును ఆదా చేయడం ద్వారా మీరు అనుకొని ఖర్చులను తీర్చుకోవచ్చు, పొదుపు చేసుకోవచ్చు లేదా ఇతర అవసరాలకు ఉపయోగించుకోవచ్చు. ఈ డబ్బు మీ జేబులో మిగులుతుంది, మీ ఆర్థిక భద్రతను పెంచుతుంది.

దీర్ఘకాలిక లాభాలు

ఒక నెల పాటు ఆల్కహాల్ విరామం తీసుకోవడం అనేది కేవలం తాత్కాలిక మార్పు కాదు. ఇది మీ జీవనశైలిలో దీర్ఘకాలిక సానుకూల ప్రభావాలను చూపగలదు. ఈ 30 రోజులు మీకు ఆల్కహాల్‌తో మీ సంబంధాన్ని పునరాలోచించుకునే అవకాశాన్ని కల్పిస్తుంది. ఈ విరామం తరువాత చాలా మంది తమ ఆల్కహాల్ అలవాట్లను మార్చుకుంటారని, లేదా పూర్తిగా మానేస్తారని వైద్యులు చెబుతున్నారు. మీరు మీ శరీరంపై, మనస్సుపై నియంత్రణను తిరిగి పొందుతారు. ఇది ఆరోగ్యం, ఆర్థిక లాభాలను స్థిరంగా ఉంచుకోవడానికి ఒక బలమైన పునాది వేస్తుంది. మరెందుకు ఆలస్యం మందు తాగే అలవాటు ఉన్నవారు వెంటనే ఈ 30 రోజుల ఛాలెంజ్ ను స్వీకరించి, ఆల్కహాల్ కు దూరంగా ఉండండి.



వారానికి ఒక్కసారే ఇన్సులిన్

షుగర్ పేషెంట్స్‌కు ఇది వరం



ప్రముఖ ఫార్మా సంస్థ నోవో నార్డిస్క్ వారానికి ఒకసారి తీసుకునే బేసల్ ఇన్సులిన్ 'అవిక్లీ' (ఇన్సులిన్ ఐకోడెక్)ని ఇండియాలో విడుదల చేసింది. ఈ నూతన ఆవిష్కరణ మధుమేహ రోగులకు రోజువారీ ఇంజెక్షన్ల బాధను తప్పించి, చికిత్సను సరళతరం చేస్తుంది.

వీక్లీ ఇన్సులిన్ ఇంజెక్షన్ వచ్చేసింది

మధుమేహ చికిత్సలో గణనీయమైన ముందడుగు పడింది. ప్రముఖ ఫార్మా సంస్థ నోవో నార్డిస్క్ కేవలం వారానికి ఒకసారి తీసుకునే బేసల్ ఇన్సులిన్ 'అవిక్లీ' (ఇన్సులిన్ ఐకోడెక్)ని భారత్‌లో విడుదల చేసింది. ప్రస్తుతం మధుమేహ బాధితులు తమ రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడానికి రోజుకు ఒకటి లేదా రెండుసార్లు ఇన్సులిన్ ఇంజెక్షన్లు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇది రోగులకు శారీరకంగా, మానసికంగా ఇబ్బందికరంగా మారుతోంది. ఈ క్రమంలోనే సంవత్సరానికి 365 సార్లు సూదులు గుచ్చుకునే బాధ నుండి ఈ అవిక్లీ ఇన్సులిన్ విముక్తి కల్పిస్తుంది.

ఎలా పనిచేస్తుంది?

వారం పాటు పనిచేసే ఈ సరికొత్త వీక్లీ ఇన్సులిన్ ఇంజెక్షన్ శరీరంలో ప్రత్యేకంగా పనిచేస్తుంది. ఇంజెక్షన్ తీసుకున్న తర్వాత అది రక్తంలో ఉండే ఆల్బుమిన్ అనే ప్రొటీన్‌తో బంధాన్ని ఏర్పరచుకుంటుంది. ఈ బంధం కారణంగా ఇన్సులిన్ శరీరంలో చాలా నెమ్మదిగా, క్రమ పద్ధతిలో వారం పాటు నిరంతరాయంగా విడుదల అవుతుంది. ఫలితంగా వారం పొడవునా బ్లడ్ షుగర్ స్థాయిలు అకస్మాత్తుగా పెరగకుండా స్థిరంగా నియంత్రించబడతాయి.

వీక్లీ ఇన్సులిన్ ప్రయోజనాలు..

అంతర్జాతీయ క్లినికల్ ట్రయల్స్ ప్రకారం.. ఈ వీక్లీ ఇన్సులిన్ ముఖ్యంగా టైప్-1, టైప్-2 డయాబెటిస్ ఉన్న పెద్దవారికి అత్యంత ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇది రోజువారీ ఇన్సులిన్‌తో పోలిస్తే HbA1c స్థాయిలను మెరుగ్గా తగ్గిస్తుంది. అలాగే రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువసేపు లక్ష్య పరిధిలో ఉండేలా చేస్తుంది. క్లినికల్ పరీక్షల్లో రక్తంలో చక్కెర నియంత్రణలో ఇది రోజువారీ ఇన్సులిన్‌తో పోలిస్తే మెరుగైన ఫలితాలను ఇచ్చినట్లు తెలుస్తోంది. భద్రతలోనూ ఇదే స్థాయి ఫలితాలు నమోదయ్యాయి. ఇది హైపోగ్లైసీమియా ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

వీక్లీ ఇన్సులిన్ వరమే..

ఆఫీసు పనుల వల్ల లేదా ప్రయాణాల వల్ల రోజువారీ ఇన్సులిన్ తీసుకోవడం మర్చిపోయే వారికి, వృద్ధులకు ఈ వీక్లీ ఇన్సులిన్ వరంగా మారబోతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీనివల్ల చికిత్సను మధ్యలో ఆపేసే సమస్యలు తగ్గుతాయి, తద్వారా మధుమేహ నియంత్రణ మరింత సులభతరం అవుతుంది. ఈ వీక్లీ ఇన్సులిన్ సాంకేతికంగా ఎంతో అధునాతనమైనది అయినప్పటికీ, దీనిని రోగులు సొంతంగా మెడికల్ షాపుల నుండి కొనుగోలు చేసి వాడకూడదు. రోగి ప్రస్తుత ఆరోగ్య స్థితిని బట్టి డోసేజీని వైద్యులే నిర్ణయించాల్సి ఉంటుంది. ఈ కొత్త ఇన్సులిన్ లభ్యత భారతదేశంలో మధుమేహ నియంత్రణలో ఒక కీలకమైన మైలురాయిగా నిలవనుంది.

ఆరోగ్యం మహా భాగ్యం, దాన్ని కాపాడుకో.
అనారోగ్యం నిన్ను విపత్తుల్లోకి నెడుతుంది.
మంచి ఆహారం, వ్యాయామం, సుఖ నిద్ర.
నీ శరీరాన్ని గౌరవించు, అది నీ ఆలయం.

ధనమే సర్వస్వం కాదు, మానవ సంబంధాలు గొప్పవి.
డబ్బు సంపాదించు, కానీ మానవత్వాన్ని మర్చిపోకు.
ఆస్తుల కంటే అనుభంధాలకు విలువ నివ్వు.
ప్రేమ, ఆప్యాయతే నిజమైన సంపద.

భయాన్ని జయించు,
ధైర్యంగా ముందుకు సాగు.
నీ అంతర్గత శక్తిని
మేల్కొలుపు, ప్రకాశించు.
సందిగ్ధత వదిలేయ్, స్పష్టమైన
నిర్ణయాలు తీసుకో.
నీ జీవితానికి నువ్వే
రూపశిల్పి.

చదువు అనేది కేవలం పుస్తకాల్లోనే కాదు, జీవిత పాఠాల్లో కూడా.
ప్రతి అనుభవం ఒక గురువు, ప్రతి అడుగు ఒక పాఠశాల.
జ్ఞానం సంపాదించు, విజ్ఞానాన్ని పంచుకో.
నీ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకో.

కాలం విలువైనది, దాన్ని వృధా చేయకు.
ప్రతి నిమిషం ఒక అవకాశం, సద్వినియోగం చేసుకో.
ప్రణాళికతో చదువు, లక్ష్యాన్ని నిర్దేశించుకో.
నీ కలను సాకారం చేసుకో.

కడుపు శుభ్రం కావాలంటే..

డీటాక్స్ డ్రింక్స్ అవసరం లేదు



కడుపు శుభ్రంగా ఉండాలని.. గట్ హెల్త్ మెరుగుపడాలని చాలామంది డీటాక్స్ డ్రింక్స్ తాగుతారు. పేగుల ఆరోగ్యానికి ఇవేమి అవసరం లేదని.. కేవలం 3 పద్ధతులు ఫాలో అయితే చాలని అంటున్నారు.

జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండాలని చాలామంది ఉదయాన్నే డిటాక్స్ డ్రింక్స్, వివిధ రకాల హెర్బల్ వాటర్స్ తాగుతుంటారు. అయితే పేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికి ఖరీదైన పానీయాలు ఏవి అవసరం లేదని చెబుతున్నారు గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ సౌరభ్ సేథి. రోజూ తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడంతో పాటు, చిన్న చిన్న అలవాట్లు పాటిస్తే జీర్ణవ్యవస్థ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచిస్తున్నారు. ఇంతకీ ఆ అలవాట్లు ఏంటో చూసేద్దాం.

ఫైబర్ రిచ్ ఫుడ్స్

పేగుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ఫైబర్ కీలక పాత్ర పోషిస్తుంది. కానీ చాలామంది తగినంత పీచు పదార్థాలు తీసుకోవట్లేదని డాక్టర్ తెలిపారు. కాబట్టి డైట్లో ఉడికించిన కూరగాయలు, ఫైబర్ ఎక్కువగా ఉండే పండ్లు, తృణధాన్యాలు, పప్పుధాన్యాలు, గింజలను చేర్చుకోవాలని సూచిస్తున్నారు. ఫైబర్ అనేది పేగుల్లో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందడానికి తోడ్పడుతుంది. అలాగే మలబద్ధకం సమస్యను తగ్గించడంలోనూ సహాయపడుతుంది. సాధారణంగా మహిళలు రోజుకు సుమారు 25 గ్రాములు, పురుషులు 38 గ్రాముల ఫైబర్ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే వయసు, ఆహార అవసరాలను బట్టి ఈ పరిమాణం మారవచ్చు. ఫైబర్‌ను ఒక్కసారిగా ఎక్కువ చేయకుండా క్రమంగా పెంచుకోవాలి.

పులియబెట్టిన ఆహారాలు

పేగుల్లో మంచి బ్యాక్టీరియా సమతుల్యతగా ఉండటం జీర్ణవ్యవస్థకు చాలా ముఖ్యం. ఇందుకు రోజువారీ ఆహారంలో పెరుగు, మజ్జిగ వంటి పులియబెట్టిన ఆహారాలను చేర్చుకోవచ్చు. వీటిలో ఉండే బ్యాక్టీరియా జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి తోడ్పడుతుంది. అందుకే వేసవిలోనే కాకుండా ఏడాది పొడవునా మజ్జిగ, పెరుగు తీసుకోవచ్చు. అలాగే చక్కెర ఎక్కువగా కలిపిన ఫ్లేవర్డ్ యోగర్ట్‌లకు బదులుగా సాధారణ పెరుగు తీసుకోవడం మంచిది. పాలు పడనివారు లేదా లాక్టోజ్‌ను జీర్ణించుకోలేనివారు తమకు సరిపోయే ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలి.

రోజువారీ నడక..

జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారంతో పాటు శారీరక శ్రమ కూడా అవసరం. రోజంతా కుర్చీలో కూర్చుని పనిచేసేవారు.. భోజనం చేసిన వెంటనే పడుకునేవారిలో కొందరికి మలబద్ధకం వంటి సమస్యలు ఎదురవుతుంటాయి. ఇలాంటి వారు ప్రతి రోజూ కొంత సమయం నడవడానికి కేటాయించాలని డాక్టర్ సౌరబ్ సేథి సూచిస్తున్నారు. నడక పేగుల కదలికలకు తోడ్పడి మలవిసర్జన సక్రమంగా జరిగేందుకు సహాయపడుతుంది. కాబట్టి భోజనం చేసిన తర్వాత వీలైతే 10 నుంచి 15 నిమిషాలు నెమ్మదిగా నడవవచ్చు. క్రమంగా రోజుకు కనీసం 30 నిమిషాల శారీరక శ్రమ చేసేలా అలవాటు చేసుకోవాలి. అయితే తిన్న వెంటనే వేగంగా నడవడం లేదా తీవ్రమైన వ్యాయామం చేయాల్సిన అవసరం లేదు.

నీళ్లు తాగడం మరచిపోవద్దు

ఫైబర్ ఎక్కువగా తీసుకునేటప్పుడు తగినంత నీరు తాగడం చాలా ముఖ్యం. శరీరంలో నీరు సరిపడా లేకపోతే ఫైబర్ తీసుకున్నప్పటికీ మలబద్ధకం పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే రోజంతా కొద్దికొద్దిగా నీళ్లు తాగుతూ ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. పేగుల ఆరోగ్యం కోసం డిటాక్స్ డ్రింక్స్ తప్పనిసరి కాదు. సమతుల్య ఆహారం, తగినంత ఫైబర్, రోజూ నడవడం, సరిపడా నీళ్లు తాగడం వంటి అలవాట్లు ఎక్కువ ఉపయోగకరంగా ఉంటాయి. తరచూ మలబద్ధకం, తీవ్రమైన కడుపునొప్పి, మలంలో రక్తం లేదా కారణం తెలియని బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలి.

వేసవిలో బరువు తగ్గడం తేలికేనా?

సంవత్సరంలో ఏ రోజు కంటే వేసవిలో బరువు తగ్గడం చాలా సులభం అని నా స్నేహితుడు చెప్పాడు. ఈ విధంగా ఏప్రిల్, మే నెలల్లో తాను 6 కిలోల బరువు తగ్గానని చెప్పింది. వేసవిలో బరువు తగ్గడం సులువైన మాట నిజమేనా? అవును అయితే, ఆహారం ఎలా ఉండాలి?

అల్పాహారంగా గంజి, పప్పు, పాతబడిన అన్నం తీసుకోవచ్చు. మధ్యాహ్న భోజనంలో మీరు చాలా పెరుగు, సలాడ్ మరియు పప్పు తినవచ్చు. మధ్యలో కొబ్బరి నీళ్లు, నిమ్మరసం తాగవచ్చు. మీరు వ్యాయామం చేస్తుంటే, మీరు ప్రోటీన్ పౌడర్ తీసుకోవచ్చు. రాత్రి భోజనానికి, మీరు ఎక్కువ నూనె వేయకుండా సూప్ మరియు తేలికగా కాల్చిన కూరగాయలను తీసుకోవచ్చు.

మధ్యాహ్న భోజనంలో నిమ్మ అన్నం, కొబ్బరి అన్నం, పెరుగు అన్నం, చింతపండు అన్నం, మామిడి అన్నం తీసుకోవచ్చు. కొబ్బరి అన్నం, సలాడ్ లేదా లెమన్ రైస్‌తో ఏదైనా వెజిటేబుల్, చింతపండుతో ఉడకబెట్టిన గుడ్డు లేదా చాలా కూరగాయలతో అవియాల్, సలాడ్ లేదా మామిడి అన్నంతో పెరుగు, సరైన కాంబినేషన్‌లో చాలా కూరగాయలతో పెరుగు అన్నం తీసుకోండి.

కరివేపాకు, కొత్తిమీర, పచ్చిమిర్చి, పెరుగుతో దోసకాయ, ఉల్లిపాయ, టమాటా, అరటి కాండం, గుమ్మడికాయ మొదలైన వాటిని తింటే చాలా మంచిది. పుచ్చకాయ ముక్కలను కొత్తిమీర, పుదీనా ఆకులు, నిమ్మరసంతో సలాడ్‌గా తినవచ్చు.

మీరు చాలా మజ్జిగ తీసుకోవచ్చు. కాస్త పెరుగు తీసుకుని అందులో చాలా నీళ్లు కలిపి అల్లం, పచ్చిమిర్చి, కరివేపాకు, కొత్తిమీర వేసి తాగాలి. రాత్రి భోజనంలో మీరు ఇడ్లీ మరియు కొబ్బరి చట్నీ తీసుకోవచ్చు. పైన పేర్కొన్న ఆహారాలు వేసవిలో జీర్ణక్రియను క్లిష్టంగా ఉంచుతాయి. ఇది బరువు తగ్గడంలో కూడా సహాయపడుతుంది.



బ్లాక్ టీ మంచిదేనా?

బరువు తగ్గాలనుకునేవారు ప్రత్యేక డైట్ ఫాలో అవుతున్నారు. ఈక్రమంలో బ్లాక్-టీకి ప్రాధాన్యం పెరుగుతోంది. చక్కెర లేకుండా తయారుచేసే బ్లాక్ టీలో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. చక్కెర కలిపిన టీ, తీపి కాఫీలకు బదులుగా బ్లాక్ టీ తీసుకోవడం వల్ల రోజువారీ కేలరీల వినియోగాన్ని తగ్గించుకోవచ్చు. బ్లాక్-టీలో పాలీఫెనాల్స్ అనే యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా థియాఫ్లేవిన్స్, థియారూబిజిన్స్ శరీరంలో కొవ్వులు, కార్బోహైడ్రేట్ల వినియోగంపై ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణుల పరిశోధనలు సూచిస్తున్నాయి. అంతేకాదు.. పేగుల్లోని మంచి బ్యాక్టీరియా ఆరోగ్యానికి కూడా ఇవి కొంతవరకు తోడ్పడుతాయి. బ్లాక్ టీలో ఉండే కెఫీన్ తాత్కాలికంగా శక్తి వినియోగాన్ని స్వల్పంగా పెంచుతుంది. అయితే ఈ ప్రభావాలన్నీ పరిమితమేనని, బరువు తగ్గడంలో బ్లాక్ టీ పాత్రపై మరిన్ని పరిశోధనలు అవసరమని నిపుణులు చెబుతున్నారు. బ్లాక్ టీ తాగితేనే బరువు తగ్గుతారని భావించడం సరికాదంటున్నారు.

ఎలా తాగాలి.. ఎన్ని తాగాలి?

అయితే బ్లాక్ టీ రోజుకు ఎన్ని కప్పులు తాగాలి? అనే ప్రశ్నలు తలెత్తవచ్చు. బరువు తగ్గడానికి నిర్దిష్టమైన మోతాదు అంటూ ఏదీ లేదని చెప్తున్నారు. కెఫీన్‌ను తట్టుకునే సామర్థ్యాన్ని బట్టి ఆరోగ్యవంతులైన పెద్దలు రోజుకు ఒకటి నుంచి మూడు కప్పుల వరకు తీసుకోవచ్చు. అయితే చక్కెర, తేనె, క్రీమ్ కలపకుండా తాగడం మంచిదంటున్నారు. ముఖ్యంగా బరువు తగ్గాలంటే బ్లాక్ టీ ఒక్కటే పరిష్కారం కాదు. సమతుల ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, తగినంత నిద్ర తప్పనిసరి అని సూచిస్తున్నారు.

తక్కువ ఖర్చు.. ఎక్కువ మేలు

సబ్జా గింజలు ఈపేరు మీరు వినే ఉంటారు. రెగ్యులర్ గా మీ ఇళ్లలో ఉపయోగిస్తూనే ఉంటారు. అయితే సబ్జా చేసే మేలు అంతా ఇంతకాదంటా. వీటిలో ఉండే అధిక ఫైబర్, అధికంగా ఉండే పీచు పదార్థాలు గుండె జబ్బులను నియంత్రిస్తుందంటా. శరీర బరువును తగ్గించడంలోను ఇది దిట్ట. రెగ్యులర్‌గా వీటిని తీసుకుంటే అరుగుదల బాగా పెరిగి.. పేగులు ఆరోగ్యంగా ఉంటాయని తెలుస్తోంది. అంతేకాదు రక్తంలో చక్కెర స్థాయిని పెరగకుండా చేస్తోంది. షుగర్‌ను కంట్రోల్ చేస్తుంది. పళ్లు, ఎముకలను దృఢంగా ఉంచుతుంది. చర్మం పొడిబారకుండా చేస్తోంది.. ముఖం మెరిసేలా చేసి అందంగా ఉండేలా సహకరిస్తుంది. వీటిని నానాబెట్టి తీసుకుంటే తక్షణ శక్తినిస్తాయి. నీరసం పోగొడుతుంది. మెదడు పనితీరు మెరుగుపడేలా చేస్తోంది.

చియా గింజలు వీటిని నీటిలో నానబెడితే ఉబ్బి జెల్‌లాగా మారతాయి. వీటిని తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. దీనివల్ల పదే పదే ఆకలి వేయకుండా ఉంటుంది. అతిగా తినే అలవాటు తగ్గుతుంది. షో మీరు ఆలస్యం చేయుండా డైట్‌లో తప్పక చియా గింజలను చేర్చుకోండి. అయితే చియా గింజలను అరగంట నానబెట్టిన తర్వాతే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అదీ రెండు స్పూన్లకు మించకూడదని చెబుతున్నారు. వీటిని రోజూ తాగే ఫ్రూట్ జ్యూస్‌లు, ప్రొటీన్ షేక్స్, స్మూతీస్‌లో కలిపి తీసుకోవడం వల్ల మంచి ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని సూచిస్తున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 21.11.2026
www.mudranews.in | @mudranews

రక్తంలో చక్కెర నియంత్రణకు తోడ్పాటు



కొత్తిమీరలోని కొన్ని సహజ సమ్మేళనాలు రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణకు సహాయపడవచ్చని పరిశోధనలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా కొత్తిమీర గింజలపై నిర్వహించిన అధ్యయనాల్లో సానుకూల ఫలితాలు కనిపించాయి. అయితే ఇది మధుమేహానికి మందులకు ప్రత్యామ్నాయం కాదు.

కనుల పండువగా ఏకశిలా ధ్వజస్తంభ ప్రతిష్టాపన

ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్: ఓవైపు రామ నామ స్మరణ, మరో వైపు దుర్గా మాత ను కొలుస్తూ భక్తులు పునీతులయ్యారు. లంగర్ హౌస్ త్రివేణి సంగం ఒడ్డున వెలసిన చారిత్రాత్మక మఠ దేవాలయం జానకి సమేత వీర వెంకట విజయ రాఘవ స్వామి ఆలయంలో ధ్వజ స్తంభ ప్రతిష్టాపన మహోత్సవం కనుల పండుగ జరిగింది. వేద పండితుల సమక్షంలో పీఠాధిపతి మహంత్ రాహుల్ దాస్ బాబా ఆధ్వర్యంలో ధ్వజ స్తంభ ప్రతిష్టాపన మహోత్సవాలు నిర్వహించగా లంగర్ హౌస్ లో పండుగ వాతావరణం నెలకొంది. ముఖ్య అతిథులుగా పరిగి ఎమ్మెల్యే రామ్ మోహన్ రెడ్డి దంపతులు, సాయి టెక్ పెయింట్స్ అధినేత ముత్యాల శేఖర్ బాబు, వ్యాపారవేత్త వెంకటేశ్వర రావు పాల్గొని ధ్వజస్తంభ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భారీ క్రేన్లను



ఏర్పాటు చేసి ఏకశిలతో తీర్చిదిద్దిన ధ్వజ స్తంభాన్ని ఆలయంలో స్థాపించారు. ఇంతకుముందు ధ్వజ స్తంభం స్థాపించే స్థానంలో తీసిన గుంతలో శ్రీ యంత్రం ఏర్పాటుచేసి, బంగారు వెండి నాణాలు, నవ ధాన్యాలు ఏదో వస్తువులను పెట్టారు.ఆంజనేయ విగ్రహాన్ని ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిద్దాం.....ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.... రామాలయం ముందు రామ్ లీలా మైదానంలో 108 అడుగులు నెల రాత్రి ఏకశిలా ఆంజనేయ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు బాబా తో కలిసి సంకల్పం తీసుకున్నామన్నారు. వరంగల్లో విగ్రహాన్ని శిల్పులు తీర్చిదిద్దుతున్నారు అన్నారు. ఇక గాంధీ సరోవర్ సందర్భంగా ఆలయం వద్ద నెలకొన్న సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తడంతో పాటు ముఖ్యమంత్రిని కలిసి సమస్యను వివరించానన్నారు. ఆయన సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరించారన్నారు. త్వరలో ఆంజనేయస్వామి విగ్రహం ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రతిష్టాపన చేపిద్దామన్నారు. ఈ సందర్భంగా భక్తులకు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో వైద్యులు విజయమ్మ, శివకుమార్, నాగేష్, వికారాబాద్ ఇన్స్పెక్టర్ రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రయ వృద్ధాశ్రమాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి హరీష్ రావు

ముద్ర, హైదరాబాద్, నవంబర్ 20:హైదరాబాద్ జిల్లా ఆశ్రయ వృద్ధాశ్రమ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమం ఈరోజు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రివర్యులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే, BRS LP డిప్యూటీ ఫ్లోర్ లీడర్ శ్రీ తన్నీరు హరీష్ రావు గారు వృద్ధాశ్రమ భవనాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా హరీష్ రావు గారు మాట్లాడుతూ సమాజంలో విద్య ఒక్కటే ముఖ్యమని భావించకూడదని, విద్యతో పాటు సంస్కారం, మానవత్వం, తల్లిదండ్రుల పట్ల గౌరవం కూడా ప్రతి ఒక్కరిలో ఉండాలని అన్నారు. తమను కని, పెంచి, పెద్ద చేసిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేయడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను ఆదరించలేని పిల్లలు జీవితంలో మానవత్వపు విలువలను కోల్పోతున్నారని పేర్కొన్నారు.అదేవిధంగా చిన్నారులను వదిలేసే తల్లిదండ్రుల తీరుపై కూడా స్పందిస్తూ, పిల్లలకు తల్లిదండ్రుల ప్రేమ, ఆప్యాయత ఎంత అవసరమో వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథంతో ముందుకు రావాలని, మానవ సేవే మాధవ సేవ అనే నినాదాన్ని ఆచరణలో పెట్టాలని పిలుపు నిచ్చారు.వృద్ధాశ్రమంలోని వృద్ధులు, అనాథ చిన్నారులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారికి చీరలు, దుప్పట్లు (బ్లాంకెట్స్), పండ్లు పంపిణీ చేశారు. వృద్ధాశ్రమ నిర్వహణకు తన వంతు సహాయంగా రూ.1,00,000 (ఒక లక్ష రూపాయలు) విరాళంగా అందజేశారు.రాబోయే రోజుల్లో కేసీఆర్ గారు తిరిగి ముఖ్యమంత్రి అయిన తర్వాత వృద్ధాశ్రమాలు, అనా



థాశ్రమాల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, వాటి అభివృద్ధికి అవసరమైన ప్రభుత్వ ఉత్తర్వులు (జీవోలు) తీసుకురావడానికి కృషి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆసరా వృద్ధాశ్రమ జనరల్ సెక్రటరీ షైనా అఫ్రోజ్ మాట్లాడుతూ, వృద్ధులు, అనాథ చిన్నారులకు సేవ చేయడమే తమ జీవిత లక్ష్యమని తెలిపారు. తమ వ్యక్తిగత సంపదలో కొంత భాగాన్ని ఇలాంటి సేవా కార్యక్రమాలకు కేటాయిస్తూ, కుటుంబ ఆదరణకు దూరమైన వృద్ధులకు బిడ్డలుగా, తల్లిదండ్రుల ప్రేమకు దూరమైన చిన్నారులకు తల్లులుగా అండగా నిలుస్తున్నామని వివరించారు. ఆశ్రమ సభ్యులందరూ ఎంతో బాధ్యతతో, ప్రేమాభిమానాలతో సేవలందిస్తున్నారని తెలిపారు.వృద్ధాశ్రమ నిర్వాహకుల సేవలను హరీష్ రావు గారు ప్రత్యేకంగా అభినందించారు. సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న ఇలాంటి సేవా సంస్థలకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆశ్రయ వృద్ధాశ్రమ అధ్యక్షురాలు వహిదా ఖాటూన్ ఉపాధ్యక్షురాలు మంత్రి కలావతి, జనరల్ సెక్రటరీ షాయిన్ అఫ్రోజ్, జాయింట్ సెక్రటరీ సరళ, కోశాధికారి పోచమ్మ, సభ్యులు జరీనా బేగం, యాదమ్మ, సంధ్యారాణి, భాగ్యమ్మ పాల్గొన్నారు.అలాగే మాజీ కార్పొరేటర్ రంగారావు, కంటెస్టెడ్ కార్పొరేటర్ ఆకుల శ్రీనివాస్, ఫజల్ భాయ్, సాయిలు, సాయితేజ రావు హాజరయ్యారు.బీ ఆర్ఎస్ డివిజన్ నాయకులు కోమట్ల శ్రీనివాస్ రెడ్డి, పురుషోత్తం యాదవ్, గోపరాజు శ్రీనివాస్ రావు, కిరణ్ యాదవ్, నవత రెడ్డి, గంగాధర్, పరునంది శ్రీకాంత్, తిరుపతి, శివరాజ్ స్వామినాయక్ భిక్షపతి శ్రీనివాస్ మెడిప్లెస్ రవి రాజు తదితర బీఆర్ఎస్ నాయకులు, సేవా సంస్థల ప్రతినిధులు, దాతలు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆశ్రయ వృద్ధాశ్రమ నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.మా నవత్వం ఉన్నచోటే నిజమైన సమాజం ఉంటుంది.. వృద్ధులను ఆదరించడం మనందరి కనీస ధర్మం!

రేషన్ కార్డుదారులకు శుభవార్త..

-డిసెంబర్ 1నుంచి షాపుల్లో అవి కూడా..

ముద్ర, డెస్క్: నిత్యావసర సరుకుల ధరల నియంత్రణపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నతాధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ధరల పెరుగుదలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేసిన సీఎం, ఏడాది కాలానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. అధికారులు ప్రతి వారం ధరల పరిస్థితిపై సమీక్ష నిర్వహించాలని సూచించారు. సామాన్యులపై ధరల భారం పడకుండా ఉండేందుకు డిసెంబర్ 1 నుంచి రాష్ట్రంలోని రేషన్ షాపుల ద్వారా కిలో కందిపప్పు రూ.100, కిలో గోధుమ పిండి రూ.25, లీటర్ పామాయిల్ రూ.125 చొప్పున విక్రయించాలని నిర్ణయించారు. అలాగే రైతు బజార్లలో కిలో ఉల్లి రూ.35కే విక్రయించే ప్రక్రియను కొనసాగించనున్నారు.ప్రభుత్వం 'ధరణి' బ్రాండ్‌తో తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని విక్రయిస్తుండగా, మొబైల్ వాహనాల ద్వారా కూడా ప్రజల వద్దకే వెళ్లి బియ్యం సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ధరల నియంత్రణ, మార్కెట్ ఇంటర్వెన్షన్ కోసం ప్రభుత్వం నెలకు రూ.100 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో బియ్యం నిల్వలు బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా నిరంతర నిఘా పెట్టాలని, హోల్‌సేల్ డీలర్లు, మిల్లర్ల వద్ద ఉన్న నిల్వలపై అధికారులకు స్పష్టమైన సమాచారం ఉండాలని సూచించారు. ఈ క్రమంలో రైతులకు ఎలాంటి నష్టం జరగకూడదని, అదే సమయంలో వినియోగదారులపై ధరల భారం పడకూడదని సీఎం స్పష్టం చేశారు.కందిపప్పు ధరల నియంత్రణతో పాటు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో కంది సాగును ప్రోత్సహించాలని అధికారులకు



దిశానిర్దేశం చేశారు. నాసిక్ రకం ఉల్లి సాగుకు అనువైన ప్రాంతాలను గుర్తించి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. నిత్యావసరాలతో పాటు కూరగాయల ధరలు కూడా పెరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం మార్కెట్ వాచ్, అగ్రీవాచ్ నిరంతరం కొనసాగించాలని ఆదేశించారు. ధరల నియంత్రణపై జిల్లాల వారీగా కలెక్టర్లతో సమావేశాలు నిర్వహించాలని, అక్రమ నిల్వలు, రవాణాపై విజిలెన్స్ నిఘాను మరింత పెంచాలని డీజీపీని సీఎం ఆదేశించారు.

ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అసంతృప్తి వెనుక అసలు కారణమేంటి?

ముద్ర, డెస్క్: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎందుకలా మాట్లాడుతున్నారు? అధికార పార్టీ శాసన సభ్యుడు అయిఉండి, సొంత ప్రభుత్వం మీదే రివర్స్ ఏవడానికి రీజనేంటి? మొండోడు రాజుకంటే బలవంతుడు అంటూ ఎమ్మెల్యే సన్నిహితులు చేస్తున్న కామెంట్స్ వెనక ప్లానేంటి? నేరుగా ముఖ్యమంత్రినే టార్గెట్ చేస్తున్న పరిస్థితుల పర్యవసానాలు ఏంటి? లెట్స్ వాచ్.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అయ్యప్ప స్వామి మాల వేసుకున్నారు. శబరిమల యాత్రకు వెళ్ళివచ్చే వరకు ఆయన రాజకీయాలకు అతీతంగా దీక్షలోనే ఉంటారని అంతా అనుకున్నారు. కానీ... దేని లెక్క దానిదే అన్నట్టుగా మాలలోనే స్వరం సవరించుకున్నారాయన. అదికూడా ధిక్కార స్వరం వినిపించడం తెలంగాణ పాలిటిక్స్‌లో కాక రేపుతోంది. నేరుగా సీఎం రేవంత్ రెడ్డినే లక్ష్యంగా చేసుకొని మునుగోడు కేంద్రంగా విమర్శలు చేశారాయన. అధికారంలో ఉన్నాం కదా అని ఇష్టం వచ్చినట్లు వ్యవహరించినా... మునుగోడుకు అన్యాయం చేసినా... ప్రజల సొమ్ము దోచుకున్నా యుద్ధం తప్పదంటూ ఘాటుగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు సొంత పార్టీ ఎమ్మెల్యే.ఆ విమర్శలు చేస్తూనే మునుగోడు ఉప ఎన్నికల సమయంలో బుల్లెట్ దిగడం మిస్సెందని, చరిత్ర సృష్టించాల్సిన మునుగోడు ప్రజలు కొద్దిగా తప్పు చేశారని కూడా కామెంట్ చేశారాయన. దేశ చరిత్రలో మునుగోడు ఉప ఎన్నికలాంటి ఉప ఎన్నిక జరగలేదని, నాడు తనను ఓడించడానికి రాష్ట్ర ప్రభుత్వమే మునుగోడుకు వచ్చిందని అన్నారు. ప్రస్తుత పాలకులు మరోసారి తప్పు చేస్తే అటువంటి నిర్ణయానికి మళ్ళీ వెనుకాడబోనంటూ హై పిచ్‌లోనే చెప్పారు రాజగోపాల్ రెడ్డి. అయితే... ఆయన అధికార పార్టీలో ఉండి ప్రతిపక్ష పార్టీ పాత్ర పోషిస్తుండటం చర్చనీయాంశమైంది. 2018లో మునుగోడు నుండి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచిన రాజగోపాల్ రెడ్డి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతిపై పదునైన విమర్శలు చేశారు.అంతేకాదు, ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమై తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. అప్పటి బైపోల్‌లో రాజగోపాల్ రెడ్డికి ఓటమి తప్పలేదు. ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల నాటికి బీజేపీని వదలి తిరిగి హస్తం గూటికి చేరారాయన. ఆ సమయంలోనే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనకు మంత్రి పదవి హామీ ఇచ్చినట్లు చెప్తున్నారు ఎమ్మెల్యే. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాతోపాటు.. రాష్ట్రంలో పలు నియోజకవర్గాలలో తాను ప్రచారం చేయడం వల్లే అక్కడ కాంగ్రెస్ గెలిచిందని... తాను బీజేపీని వదిలి కాంగ్రెస్ కు రావడం వల్ల కాంగ్రెస్ పెద్ద మైలేజ్ పెరిగిందన్నది ఆయన లెక్క. తన వల్లే తెలంగాణలో కాంగ్రెస్ విజయతీరాలకు చేరిందని గట్టిగా నమ్ముతున్నారట రాజగోపాల్ రెడ్డి. మరోవైపు పార్టీ అధిష్టానం మాత్రమే కాదు... పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో సీయం రేవంత్ రెడ్డి కూడా తనను మంత్రిని చేస్తానని బహిరంగ సభలో చెప్పారంటూ గుర్తు చేస్తున్నారు రాజగోపాల్. పార్టీకి నేను ఇచ్చిన హామీ నెరవేర్చాను. నాకు అధిష్టానం, సీయం ఇచ్చిన హామీని కూడా నెరవేర్చాలి కదా అన్నది ఆయన క్వశ్చన్.ఒకసారి ఎంపీగా, ఎమ్మెల్సీగా, రెండో సారి ఎమ్మెల్యేగా పనిచేస్తున్నానని.. తనకు రాష్ట్ర వ్యాప్తంగా, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనూ చాలా నియోజకవర్గాలపై గట్టి పట్టు ఉందని.. గెలుపు ఓటములను ప్రభావితం చేయగలిగే సత్తా ఉందని అంటున్నారట. మంత్రి పదవి విషయంలో తనకు ఇచ్చిన హామీ నెరవేర్చకపోగా... . నియోజకవర్గ అభివృద్ధికి అడిగినన్ని నిధులు కూడా



విడుదల చేయడం లేదని అసంతృప్తిగా ఉన్నట్టు చెబుతున్నారు. అలాగే... నిబంధనల ప్రకారం తమ కంపెనీకి రావాల్సిన కాంట్రాక్టులు మరెవరికో దక్కేలా ప్రభుత్వ పెద్దలు తెరవెనక మంత్రాంగం నడిపించారంటూ మండిపడుతున్నారట.ఇవన్నీ చూస్తుంటే.... పుండు మీద కారం చల్లినట్టుందని, పొమ్మనలేక పొగబెట్టినట్టు కనిపిస్తోందని సన్నిహితులతో అంటున్నట్టు తెలిసింది. ఈ పరిస్థితుల్లో... సొంత పార్టీ ముఖ్యనేతల తీరుపై చాలాకాలంగా అసంతృప్తిగానే ఉన్నారట ఆచయన. అందుకే ధిక్కార స్వరం రోజురోజుకు పెరుగుతోందంటున్నారు పరిశీలకులు. మొండివాడు రాజు కన్నా బలవంతుడన్న సామెతను గుర్తు చేస్తున్నారు రాజగోపాల్ రెడ్డి సన్నిహితులు. కొద్ది రోజుల క్రితం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కోమటిరెడ్డి బ్రదర్స్ లక్ష్యంగా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో విమర్శలు చేశారు. తాజాగా నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్ ప్రెస్ మీట్ పెట్టి రాజగోపాల్ రెడ్డిపై ఏఐసీసీకి ఫిర్యాదు చేస్తానంటూ పొలిటికల్ హీట్ పెంచారు. మొత్తం మీద మునుగోడు ఎమ్మెల్యే ధిక్కారస్వరం, ఆయనకు సొంత పార్టీనేతల కౌంటర్‌తో ఉమ్మడి నల్లగొండ జిల్లా హస్తం పార్టీ రాజకీయాలు ఏ మలుపు తీసుకుంటాయోనన్న ఉత్కంఠ పెరుగుతోంది పొలిటికల్ సర్కిల్స్‌లో.

డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యం

రేపు హైదరాబాద్‌లో మెగా సదస్సు

ముద్ర, హైదరాబాద్, నవంబర్ 20: 2

029 నాటికి డ్రగ్స్ రహిత భారతదేశాన్ని నిర్మించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లో శనివారం (నవంబర్ 21) 'సిటీ కన్వెన్షన్ ఆన్ డ్రగ్ ఫ్రీ ఇండియా' పేరిట మెగా సన్నాహక సదస్సు నిర్వహించనున్నారు. శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ఉదయం 11.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'వికసిత్ భారత్ సంకల్ప అభియాన్ కోసం నషా ముక్త్ యువ' కార్యక్రమంలో భాగంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు 'హైదరాబాద్ వాక్స్ – నషా ముక్త్ భారత్' పేరుతో భారీ అవగాహన పాదయాత్ర నిర్వహించనున్నారు. అంబర్‌పేట నుంచి జూబ్లీహిల్స్ వరకు ఈ పాదయాత్ర కొనసాగనుంది. ఈ పాదయాత్రను విజయవంతం చేయడంతో పాటు డ్రగ్స్ మహమ్మారిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మెగా సన్నాహక సదస్సును ఏర్పాటు చేస్తున్నారు. ఈ సదస్సుకు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. వీరితో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొననున్నారు. డ్రగ్స్ వ్యసనానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచే ఈ కార్యక్రమానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరై విస్తృత ప్రచారం కల్పించాలని నిర్వాహకులు ఆహ్వానించారు.

ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు

ఫిర్యాదును అందించిన కాంగ్రెస్ పార్టీ ఎస్సి డిపార్ట్మెంట్ చైర్మన్ రవికుమార్

ముద్ర, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదలను ఆదుకునే సదుద్దేశంతో అర్హులైనటువంటి నిరుపేదలకు వివిధ రకాల పింఛన్ల పంపిణీ కోసం ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక ప్రభుత్వ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కుట్ర పూరిత రాజకీయాలతో అలజడి సృష్టించడమే కాకుండా ఇష్టానుసారంగా దూషించినట్లు ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎస్సి డిపార్ట్మెంట్ చైర్మన్ ఊరుపక్క రవికుమార్ సంచల ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే బెదిరింపు ధోరణితో తీవ్ర ఆవేదనకు గురైన తాము శుక్రవారం సాయంత్రం సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఎమ్మెల్యేపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.



అనంతరం మీడియా విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 18వ తేదీన చంపాపేట్ లో ప్రభుత్వ ఎంఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినటువంటి పేదలకు పింఛన్ల పంపిణీని కార్యక్రమానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొని అడ్డుకొని, మహిళలు వికలాంగులు, చిన్నారులు, వితంతువులను భయభ్రాంతులకు గురయ్యాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సృష్టించిన టువంటి అలజడి బెదిరింపులపై సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఓట్లు వేసి గెలిపించిన ఎల్బీనగర్ ప్రజలను ఎమ్మెల్యే కుట్రపూరితంగా రౌడీ మూకలను తీసుకువచ్చి అధికారులు, పోలీస్ లను బెదిరించిన సుధీర్ రెడ్డి, ఆయన అనుచరులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఓబీసీ ప్రెసిడెంట్ దేరంగుల కృష్ణ, చింతలకుంట డివిజన్ చైర్మన్ బాలకృష్ణ, గడ్డి అన్నారం డివిజన్ చైర్మన్ అనసూయ శాంతి, హస్తినాపురం డివిజన్ చైర్మన్ షాగా శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

భారతీయులకు మలేషియా షాక్.. వీసా ఫ్రీ ఎంట్రీ నిలిపివేత

ముద్ర, కౌలాలంపూర్ : భారతీయులకు మలేషియా మరో షాక్ ఇచ్చింది. ఇప్పటి వరకు భారతీయులకు కల్పిస్తున్న వీసా రహిత ప్రవేశాన్ని 2027 జనవరి 1 నుంచి నిలిపివేస్తున్నట్టు మలేసియా ఇమ్మిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది. ఇన్ని రోజులు మలేసియాకు వెళ్లే భారతీయులకు 30 రోజుల వీసా మినహాయింపు ఉండేది.ప్రయాణికులు చేరుకోవడానికి మూడు రోజుల ముందుగా మలేసియా డిజిటల్ అరైవల్ కార్డ్‌లో నమోదు చేసుకుంటే సరిపోయేది. ఈ వీసా మినహాయింపును 2023 డిసెంబర్ 1న ప్రవేశపెట్టగా.. 2026 చివరి దాకా పొడిగించారు. జనవరి 1 నుంచి మలేసియాకు వెళ్లే భారతీయులు ప్రయాణానికి ముందే చెల్లుబాటయ్యే వీసా తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నది.



అణు యుద్ధాన్ని ఎవరూ గెలవలేరు

అలాంటి యుద్ధం ఎప్పటికీ జరగకూడదు

ట్రంప్, జిన్‌పింగ్, పుతిన్ 'పీస్ డిక్లరేషన్'

చైనాలోని షెన్‌జెన్‌లో తొలి త్రైపాక్షిక భేటీ



ముద్ర, షెన్‌జెన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ చైనాలోని షెన్‌జెన్‌లో తొలిసారి త్రైపాక్షిక సమావేశం నిర్వహించారు. 90 నిమిషాలపాటు సాగిన ఈ భేటీ అనంతరం 'డిక్లరేషన్ టువార్డ్స్ పీస్' పేరుతో నాలుగు అంశాల ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. ఐక్యరాజ్యసమితిని మరింత సమర్థంగా తీర్చిదిద్దేందుకు సంస్కరణలు చేపట్టాలని, ప్రపంచదేశాల ప్రయోజనాల కోసం శుద్ధి చేసిన చమురు ఉత్పత్తి, సరఫరాను పెంచాలని నిర్ణయించారు. అణు యుద్ధాన్ని ఎవరూ గెలవలేరని, అణ్వాయుధాల ముప్పును తగ్గించేందుకు, వాటి వ్యాప్తిని నిరోధించేందుకు చర్చలు జరుపాలని అంగీకరించారు.అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు తన అధికార పరిధిని దుర్వినియోగం చేయరాదని స్పష్టంచేశారు. రెండో ప్రపంచ యుద్ధానంతరం అంతర్జాతీయ వ్యవస్థను కాపాడాల్సిన బాధ్యత మూడు దేశాలపై ఉందని జిన్‌పింగ్ పేర్కొన్నారు. వివాదాలను చర్చలు, దౌత్య మార్గాల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఉక్రెయిన్ యుద్ధంపై ట్రంప్, పుతిన్ చర్చించారు. అయితే భవిష్యత్తులో ఈ తరహా సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహించడంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పుతిన్ తెలిపారు. విభేదాలున్న దేశాలతో చర్చలకు దూరంగా ఉండటం వల్ల సమస్యలు పరిష్కారం కావని ట్రంప్ వ్యాఖ్యానించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 21.11.2026
www.mudranews.in | @mudranews

చర్మ సౌందర్యానికి మేలు

కొత్తిమీరలోని విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు చర్మ కణాల ఆరోగ్యానికి తోడ్పడతాయి. ఫ్రీ రాడికల్స్ ప్రభావాన్ని తగ్గించడంలో, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడవచ్చు. యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు కూడా చర్మ సంరక్షణకు ఉపయోగపడవచ్చు.



కరీంనగర్ కార్పొరేషన్ అత్యవసర భేటీ: 10 అంశాలకు ఆమోదం





ముద్ర, కరీంనగర్: కరీంనగర్ నగరపాలక సంస్థ అత్యవసర సర్వసభ్య సమావేశం మేయర్ కొలగాని శ్రీనివాస్ అధ్యక్షతన, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు సమక్షంలో జరిగింది. సమావేశంలో 10 ఎజెండా అంశాలకు పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు పలు ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరించాలని మేయర్ అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గి బోర్లలో నీరు సరిగా రావడం లేదని, ప్రజలు నగరపాలక సంస్థ సరఫరా చేసే తాగునీటిపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. గతంలో రూ.13 వేలు ఉన్న సెకండ్ నల్లా కనెక్షన్ ఛార్జీని తమ హయాంలో కౌన్సిల్ తీర్మానంతో రూ.వెయ్యికి తగ్గించి కనెక్షన్లు ఇచ్చామని గుర్తుచేశారు. స్పెషల్ ఆఫీసర్ పాలనలో తొలగించిన సెకండ్ నల్లా కనెక్షన్లను తిరిగి పునరుద్ధరించాలని కోరారు.

స్మార్ట్ సిటీలో రూ.100 కోట్లతో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) పనితీరుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సీసీ కెమెరాలు, ట్రాఫిక్ సిగ్నల్స్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం, వీఎండీ డిస్ ప్లేలు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. నగరంలోని పది ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎయిర్ క్వాలిటీ సెన్సార్ల వివరాలు ప్రజలకు అందుబాటులో లేవని పేర్కొన్నారు. అలాగే వాణిజ్య దుకాణాల్లో చెత్త సేకరణను పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన 7 వేల ఆర్ఎఫ్ ఐడీ ట్యాగ్ లు, స్కానర్ల వినియోగంపై అనుమానాలు వ్యక్తం చేశారు. స్వచ్ఛ ఆటోలకు ఏర్పాటు చేసిన జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ కూడా సక్రమంగా పనిచేయడం లేదని ఆరోపించారు. నానిరకం పరికరాలు ఏర్పాటు చేసి సేవలు అందించకుండానే బిల్లులు చెల్లిస్తున్నారనే అనుమానాలున్నాయని తెలిపారు. ఐసీసీసీ నిర్వహణలో జరిగిన లోపాలపై సంబంధిత సంస్థపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజలకు పూర్తిస్థాయి సేవలు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కరీంనగర్‌లో 30 శాతం తాగునీరు వృథా.. లీకేజీలను అరికట్టాలి

స్మార్ట్ సిటీ లైట్లు వెలగక పట్టణంలో అంధకారం.. అధికారుల నిర్లక్ష్యంపై కార్పొరేటర్ అంజన్ కుమార్ ఆగ్రహం



ముద్ర, కరీంనగర్: కరీంనగర్ నగరపాలక సంస్థ అత్యవసర కౌన్సిల్ సమావేశంలో అధికారుల నిర్లక్ష్యంపై కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ తీవ్రంగా నిలదీశారు. నగరంలో వాటర్ సప్లై లీకేజీల కారణంగా సుమారు 30 శాతం తాగునీరు వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎల్‌నినో, కరువు పరిస్థితుల నేపథ్యంలో నీటిని పొదుపు చేయాల్సిన అవసరం ఉందని, వెంటనే లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. డివైడర్లలోని చెట్లకు శుద్ధి చేసిన తాగునీటిని వినియోగించకుండా ఎస్టీపీ ప్లాంట్ నీటిని ఉపయోగించాలని సూచించారు. అలాగే స్మార్ట్ సిటీ నిధులతో ఏర్పాటు చేసిన వీధి దీపాలు రెండు రోజులకే పనిచేయడం లేదని, నగరంలోని పలు ప్రాంతాలు చీకటిమయంగా మారుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యతలేని లైట్లు ఎందుకు ఏర్పాటు చేశారని మేయర్, అధికారులను ప్రశ్నించారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా అర్హులైన పేదలకు చేయూత పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

రూ.20 వేల కోట్లతో పట్టణాల అభివృద్ధికి ప్రణాళికలు

ముద్ర, హైదరాబాద్ :తెలంగాణలో పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.20 వేల కోట్లతో భారీ ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ మేరకు పురపాలక శాఖ రూపొందించిన ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, ఏఐఐబీ, జర్మనీకి చెందిన కేఎఫ్ డబ్ల్యూ బ్యాంకులతో పాటు దేశీయ ఆర్థిక సంస్థల సహకారంతో ఈ ప్రాజెక్టులను చేపట్టాలని నిర్ణయించారు. వరంగల్ లో భూగర్భ డ్రైనేజీ, వర్షపు నీటి పారుదల వ్యవస్థ, కోట కందకం పునరుద్ధరణ, హనుమకొండలో సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ అభివృద్ధిపై చర్చించారు. అలాగే మురుగునీటిని శుద్ధి చేసి పరిశ్రమలకు వినియోగించడం, వ్యర్థాల నుంచి 10–12 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, బయో సీఎన్ జీ, ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్ల ఏర్పాటుపైనా సమీక్షించారు. పట్టణాల్లో వరద ముప్పు తగ్గించడం, నీటి వనరుల పరిరక్షణ, కర్బన ఉద్గారాలు, నిర్వహణ వ్యయాన్ని తగ్గించడం ఈ ప్రాజెక్టుల ప్రధాన లక్ష్యాలని ప్రభుత్వం పేర్కొంది.

డిసెంబర్ 1న ఛలో ఢిల్లీని జయప్రదం చేయండి



ముద్ర, కరీంనగర్: కనీస వేతనం రూ.42 వేలు, కనీస పెన్షన్ రూ.21 వేలు అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో నిర్వహించనున్న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గీట్ల ముకుంద రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవన్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మిక కుటుంబానికి నెలకు రూ.42 వేల కనీస వేతనం ఇవ్వాలని, హమాలీ, ఆటో, భవన నిర్మాణ, గిగ్, స్వయం ఉపాధి కార్మికులకు కూడా అదే స్థాయిలో ఆదాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలని కోరారు. కార్మిక హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడులను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసే వరకు కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు యు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎడ్ల రమేష్, జనగాం రాజమల్లు, మారెళ్ళ శ్రీలత, నలువాల స్వామి, సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భగత్ నగర్‌లో నూతన సంఘం డెయిరీ పార్లర్ ప్రారంభం



ముద్ర, కరీంనగర్ : కరీంనగర్ నగరంలోని భగత్ నగర్లో వాటర్ ట్యాంక్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'సంఘం డెయిరీ పార్లర్' ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మేయర్, ప్రస్తుత నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి నూతన పార్లర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ.. నాణ్యమైన, స్వచ్ఛమైన పాలు, పాల ఉత్పత్తులను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. భగత్ నగర్ పరిసర ప్రాంత ప్రజ ల అవసరాలకు అనుగుణంగా ఈ నూతన డెయిరీ పార్లర్ ఎంతగానో ఉప యోగ పడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ, పార్లర్ నిర్వాహకులకు ప్రత్యేక శుభా కాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, చొప్పరి జయశ్రీ, సొగాని కొమురయ్య, ఇతర బిజెపి నాయకులు పండుగ నాగరాజు, రాము, సంఘం డైరీ యాజమాన్యం అచ్యుత్ రావు, ప్రకాష్, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఆల్ఫోర్స్ విద్యార్థి ఎంపిక



ముద్ర, కరీంనగర్: క్రీడలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలకు చెందిన ఎం. రుతిక్ రెడ్డి 70వ ఎస్‌జీఎఫ్ అండర్–19 జిల్లా స్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 21న రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో నరేందర్ రెడ్డి విద్యార్థిని అభినందించి పుష్పగుచ్ఛం అందజేశారు. క్రీడలతో పాటు చదువులోనూ విద్యార్థులు రాణించాలని, క్రీడల ద్వారా ఉపాధి అవకాశాలు సైతం లభిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాతవాహన వర్సిటీలో ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

ముద్ర, కరీంనగర్: శాతవాహన విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు వెంటనే స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. గత ఏడు రోజులుగా విద్యార్థి జేఏసీ నాయకుడు లింగంపల్లి మహేష్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలను ఆయన పార్టీ నాయకులతో కలిసి సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భౌతిక శాస్త్రం, గణితం, కంప్యూటర్ సైన్స్‌తో పాటు పలు కోర్సుల్లో భారీగా సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఐటీ కోర్సులో ఒక్క విద్యార్థి కూడా చేరకపోవడం ఆందోళనకరమన్నారు. కొన్ని కోర్సులకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించినప్పుడు మిగతా కోర్సులకు కూడా అదే విధానం ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. గ్రామీణ విద్యార్థులకు విశ్వవిద్యాలయ కోర్సులపై అవగాహన కల్పించి, ఖాళీ సీట్లను భర్తీ చేయాలని కోరారు. తెలంగాణ రక్షణ సేన నగర అధ్యక్షుడు రంగరవేణి లక్ష్మణ్, చంటి శ్రీనివాస్, కుతాడితో పాటు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బత్తుల రాజు, నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచ రాజకీయాల్లో భారత్ "సైడ్ ప్లేయర్"..

భారత్ ఎక్కడంటూ రాహుల్ ప్రశ్న



ముద్ర, న్యూఢిల్లీ : అంతర్జాతీయ రాజకీయాల్లో భారత్ తన ప్రాధాన్యతను కోల్పోతోందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు. అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతల నివారణకు పాకిస్థాన్ చర్చలు జరుపుతుంటే భారత్ పక్కన ఉండిపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. చికాగో యూనివర్సిటీలో విద్యార్థులతో జరిగిన ముఖాముఖిలో మాట్లాడుతూ.. భారత్ ఒకప్పుడు ప్రపంచ పరిణామాలను ప్రభావితం చేసేదని, ఇప్పుడు అంతర్జాతీయ దౌత్య చర్చల్లో సైడ్ ప్లేయర్‌గా మారిందని వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ విదేశాంగ విధానంపైనా విమర్శలు గుప్పించారు. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. విదేశీ గడ్డపై భారత్ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని మండిపడింది. రాహుల్‌ను 'పాకిస్థాన్ ఫ్యాన్ బాయ్'గా అభివర్ణిస్తూ విమర్శలు చేసింది.

సంఘాల భవన నిర్మాణాలకు రూ.30 లక్షల ఎంపీ లాడ్స్ నిధులు

గంగుల కమలాకర్ ప్రతిపాదనలకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సానుకూల స్పందన



ముద్ర, కరీంనగర్: నగరంలోని మూడు వృత్తి సంఘాల భవన నిర్మాణాలకు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఎంపీ లాడ్స్ నిధుల నుంచి రూ.30 లక్షలు మంజూరు చేశారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేసిన ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించిన ఎంపీ.. ఒక్కో సంఘానికి రూ.10 లక్షల చొప్పున కేటాయించారు. తీగలగుట్టపల్లిలోని నాయీ బ్రాహ్మణ సంఘం భవన నిర్మాణ పనుల పూర్తి కోసం రూ.10 లక్షలు, ఐటీ టవర్ పక్కన ఫోర్ వీలర్స్ మెకానిక్ అసోసియేషన్ భవనానికి రూ.10 లక్షలు, ఎలక్ట్రిషన్స్ అసోసియేషన్ భవన నిర్మాణానికి మరో రూ.10 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తన నివాసంలో ఆయా సంఘాల బాధ్యులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. వృత్తి సంఘాలకు సొంత భవనాలు ఉంటే సమావేశాలు, వృత్తిపరమైన కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి సౌకర్యంగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సంఘాల అవసరాలను ఎంపీ రవిచంద్ర దృష్టికి తీసుకెళ్లగా, నిధులు మంజూరు చేయడం పట్ల ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కరీంనగర్ అభివృద్ధితో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తామని గంగుల కమలాకర్ పేర్కొన్నారు.

పేదింటి బిడ్డకు అండగా నిలిచిన గంగుల

జాతీయ కరాటే పోటీలకు ఎంపికైన రేవంత్‌కు ఆర్థిక భరోసా
లూధియానా వెళ్లేందుకు అయ్యే ఖర్చులన్నీ తానే భరిస్తానని హామీ



ముద్ర, కరీంనగర్: జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన పేద విద్యార్థి రేవంత్ కుమార్‌కు మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అండగా నిలిచారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పోటీలకు వెళ్లలేని పరిస్థితి ఉందని తెలుసుకుని, లూధియానాలో జరిగే జాతీయ పోటీలకు వెళ్లేందుకు అయ్యే ప్రయాణ, ఇతర ఖర్చులన్నీ తానే భరిస్తానని హామీ ఇచ్చారు. కరీంనగర్‌కు చెందిన రేవంత్ ఇటీవల రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. అయితే అతడి తండ్రి రమేష్ మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండటంతో పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. విషయం తెలుసుకున్న గంగుల శుక్రవారం రేవంత్‌ను తన నివాసానికి పిలిపించి అభినందించి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆర్థిక ఇబ్బందులను పట్టించుకోకుండా క్రీడలపై దృష్టి సారించి, మరింత కష్టపడి జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. రేవంత్ సీనియర్ కరాటే మాస్టర్ సురభి వేణుగోపాల్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. తమ కుమారుడికి అండగా నిలిచిన గంగుల కమలాకర్‌కు రేవంత్ తండ్రి రమేష్ కృతజ్ఞతలు తెలిపారు.

కరీంనగర్ అభివృద్ధి మళ్లీ పట్టాలెక్కాలంటే బీఆర్ఎస్ రావాలి

ఫోర్ వీలర్స్ అసోసియేషన్ నూతన భవనం ప్రారంభం.. త్వరలో ఏసీల ఏర్పాటు



ముద్ర, కరీంనగర్: కరీంనగర్ నగరం మళ్లీ అభివృద్ధి పథంలో పయనించాలంటే రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, భవిష్యత్తులోనూ నిలిచిపోయిన పనులను వేగవంతం చేసి హైదరాబాద్ తర్వాత అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు.కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఐటీ టవర్ సమీపంలో నూతనంగా నిర్మించిన ఫోర్ వీలర్స్ అసోసియేషన్ భవనాన్ని గంగుల కమలాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలనతో భవనాన్ని ప్రారంభించారు.


ఈ సందర్భంగా గంగుల మాట్లాడుతూ.. అసోసియేషన్ భవన నిర్మాణానికి గతంలోనే తన వంతుగా రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించినట్లు గుర్తుచేశారు. సభ్యుల సౌకర్యార్థం త్వరలోనే భవనంలో ఏసీలు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. సమావేశాలు, ఇతర కార్యక్రమాలు లేని సమయంలో భవనాన్ని సామాన్య ప్రజల శుభకార్యాలకు తక్కువ అద్దెకు కేటాయించాలని సూచించారు. తద్వారా సంఘానికి ఆదాయం సమకూరడంతో పాటు భవన నిర్వహణకు ఉపయోగపడుతుందని అన్నారు. మూడు వృత్తి సంఘాలకు రూ.30 లక్షలు, ప్రహరీ నిర్మాణానికి మరో రూ.10 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.

గత పదేళ్లలో నగర రూపురేఖలు మార్చాం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ నగర రూపురేఖలు మార్చేలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని గంగుల పేర్కొన్నారు. విశాలమైన రహదారులు, ఐటీ టవర్, మానేరు రివర్ ఫ్రంట్, చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో నగరానికి కొత్త రూపునిచ్చామని తెలిపారు. కోట్లాది రూపాయల నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించి నగర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. కరీంనగర్ భక్తుల చిరకాల ఆకాంక్షగా ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, మరో రెండేళ్లలోపు ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని గంగుల కమలాకర్ తెలిపారు. కరీంనగర్ ఆల్ ఫోర్ వీలర్స్ మెకానిక్స్ వెల్ఫేర్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు వడ్లూరి శ్రీనివాస్, అధ్యక్షుడు కానిగంటి రమేష్, ఉపాధ్యక్షుడు ఎం.డి. షాఫీరుద్దీన్ బాబా, ప్రధాన కార్యదర్శి జూపా మునిందర్ రెడ్డి, సహాయ ప్రధాన కార్యదర్శి మట్టెల బాబు, అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 21.11.2026
www.mudranews.in | @mudranews

కొత్తిమీర రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది



కొత్తిమీరలో ఉండే విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి తోడ్పడతాయి. శరీర కణాలను ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి రక్షించడంలో కూడా ఇవి ఉపయోగపడతాయి.

చిల్లర మాటలు.. అబద్ధాలతో కాలయాపన

ముద్ర, సిద్దిపేట : సిద్దిపేట సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ఘాటు వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మాటల యుద్ధానికి తెరలేపాయి. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పాటు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రేవంత్ చేసిన విమర్శలను బీఆర్ఎస్ అగ్రనేతలు తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ప్రజా సమస్యలపై మాట్లాడకుండా వ్యక్తిగత విమర్శలకు దిగడం ఏమిటని ప్రశ్నించారు.రైతుల కష్టాలు, కరువు పరిస్థితులు, పెండింగ్ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై సమాధానం చెప్పలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకే రేవంత్ రెడ్డి చిల్లర మాటలు, అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్నారని కేటీఆర్, హరీశ్ రావు మండిపడ్డారు. సిద్దిపేటకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు చిల్లిగవ్వ మేలు అయినా చేసిందా? అని నిలదీశారు. సిద్దిపేట నియోజకవర్గంలో సుమారు రూ.1,070 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆ పనులను ఎప్పుడు పూర్తి చేస్తారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పనులపై దృష్టి పెట్టకుండా గత ప్రభుత్వంపై విమర్శలు చేయడం వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదని వ్యాఖ్యానించారు.రైతులకు ఇచ్చిన హామీలు, ప్రజలకు ప్రకటించిన సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ నేతలు కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రాజకీయ విమర్శలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించాల్సిన వేదికలపై వ్యక్తిగత దూషణలకు దిగడం ముఖ్యమంత్రి హోదాకు తగదని హితవు పలికారు.



అభివృద్ధి, సంక్షేమంపై చర్చకు సిద్ధమా? లేక విమర్శలతోనే పాలన సాగిస్తారా? అని రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. సిద్దిపేట సభలో రేవంత్ చేసిన వ్యాఖ్యలకు బీఆర్ఎస్ నేతలు ఘాటుగా స్పందించడంతో రాష్ట్ర రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శల పర్వం మరింత వేడెక్కింది.

టిప్పర్ ఢీకొని ఇద్దరు మహిళలు మృతి

స్కూటీని ఢీకొట్టిన టిప్పర్.. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, టీచర్ దుర్మరణం



ముద్ర, సూర్యాపేట, నవంబర్ 20 : సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బీబీగూడెం నుంచి మార్కెట్‌కు వెళ్లే మార్గంలో స్కూటీని టిప్పర్ ఢీకొట్టడంతో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు.ఈ ప్రమాదంలో చివ్వెంల మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రజితా రెడ్డి, అదే పాఠశాలకు చెందిన మరో ఉపాధ్యాయురాలు రక్మ మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారం. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.సమాచారం అందుకున్న సూర్యాపేట పట్టణ సీఐ వెంకటయ్య, ఎస్సై, ఇతర పోలీసు సిబ్బంది వెంటనే ప్రమాద స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును ప్రత్యక్ష సాక్షులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి వివరాలు సేకరించారు.ప్రమాదానికి గల పూర్తి కారణాలు, మృతుల వివరాలపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

డోభాల్‌కు అమెరికా కోర్టు సమన్ల అంశం.. ఖండించిన భారత్

ముద్ర, న్యూఢిల్లీ : భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, రా మాజీ చీఫ్ సామంత్ గోయెల్‌కు దిల్లీ న్యాయస్థానాల ద్వారా తమ సమన్లు అందజేయాలని అమెరికా ఫెడరల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై భారత ప్రభుత్వం మరోసారి స్పందించింది. అటువంటి నిరాధారమైన దావాలను ఖండిస్తున్నామని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ పేర్కొన్నారు. ఆ వ్యవహారంలో తమ వైఖరి ఇదేనని స్పష్టం చేశారు. ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ దాఖలు చేసిన సివిల్ దావా విచారణకు సంబంధించి అమెరికా ఫెడరల్ కోర్టు ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది.

కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా ఆకుల ఉదయ్

ముద్ర, కరీంనగర్: కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా అకుల ఉదయ్ నియమితులయ్యారు. ఈ మేరకు అర్బన్ డిసిసి అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ నియామక పత్రాన్ని శుక్రవారం అందించారు. తన నియమాకానికి సహకరించిన అర్బన్ డిసిసి అధ్యక్షుడు కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపి ఆశీర్వాదం తీసుకున్నారు .

ఈ సందర్భంగా ఉదయ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ గారికి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం గారికి, మనకొండూర్ శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ గారికి, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ గార్లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అలాగే కరీంనగర్ నగరంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని ఉదయ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు, దుష్ప్రచారాన్ని ఎప్పటికప్పుడు వాస్తవాలతో తిప్పికొడతామని తెలిపారు.కాంగ్రెస్ పార్టీని నగరంలో మరింత బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఉదయ్ అన్నారు. నూతన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పార్టీ కోసం పనిచేస్తానని పేర్కొన్నారు.



శ్రీ మహాశక్తి ఆలయంలో ప్రారంభమైన 'గురు చరిత్ర' ప్రవచనం

నవంబర్ 26 వరకు దేవాలయంలో కొనసాగనున్న ప్రవచన కార్యక్రమం
శనివారం చిలుకు ద్వాదశి సందర్భంగా సాయంత్రం తులసీ దామోదర కళ్యాణం
కార్తీక పౌర్ణమి సందర్భంగా 24న ఉదయం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు
పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని ఆలయ నిర్వాహకుల పిలుపు

ముద్ర, కరీంనగర్ : పవిత్ర కార్తీక మాసం సందర్భంగా కరీంనగర్ లోని శ్రీ మహాశక్తి దేవాలయంలో శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామి ఆశీస్సులతో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా నేటి నుండి (ఈ నెల నవంబర్ 20) నవంబర్ 26 వరకు ప్రతిరోజూ సాయంత్రం 6:45 గంటల నుంచి రాత్రి 8:30 గంటల వరకు శ్రీ గురు చరిత్ర ప్రవచన కార్యక్రమం జరగనుంది. పౌరాణిక ప్రవచనకర్త, ప్రవచన చక్రవర్తి, శ్రీ మల్లాది చంద్రశేఖర శాస్త్రి ప్రియశిష్యులు బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో శ్రీ గురు చరిత్ర ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దీంతోపాటు రేపు (నవంబర్ 21 తేదీ) శనివారం సాయంత్రం 6 గంటలకు శ్రీ తులసీ దామోదర కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. 24న కార్తీక పౌర్ణమి సందర్భంగా ఉదయం 4 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకపూజలు, 8 గంటల నుండి సామూహిక రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు కోరారు. శ్రీ దత్తాత్రేయ స్వామివారి గురు చరిత్ర పారాయణం, శ్రవణం ద్వారా ఆధ్యాత్మిక జ్ఞానం, భక్తిభావం పెంపొందుతాయని, గురుచరిత్రలోని మహిమలు భక్తులకు ఆధ్యాత్మిక మార్గదర్శకంగా నిలుస్తాయని నిర్వాహకులు తెలిపారు.



ఎకరంన్నర భూమిలోనే బహుళ ఆదాయ మార్గాలు

సమీకృత వ్యవసాయంతో ఆదర్శంగా రైతు మల్లయ్య

ఆయిల్‌పామ్‌లో అంతర పంటలు..

నాటుకోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం

ముద్ర, సూర్యాపేట, నవంబర్ 20: వ్యవసాయం చేయాలంటే పెద్ద మొత్తంలో భూమి ఉండాలనే అపోహను తొలగిస్తూ.. ఉన్న కొద్దిపాటి భూమినే సమర్థవంతంగా వినియోగించుకుంటే బహుళ ఆదాయ మార్గాలను సృష్టించుకోవచ్చని నిరూపిస్తున్నారు నూతనకల్ మండలం చిననేమిల గ్రామానికి చెందిన రైతు పిల్లలమర్రి మల్లయ్య. తనకున్న ఎకరంన్నర భూమిలో సమీకృత వ్యవసాయ విధానాలను అనుసరిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. శుక్రవారం ఆయన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్.. మల్లయ్య అనుసరిస్తున్న వినూత్న సాగు పద్ధతులను పరిశీలించి అభినందించారు.ఒకే భూమిలో.. అనేక పంటలుసాధారణంగా ఒకే పంటపై ఆధారపడే విధానానికి భిన్నంగా మల్లయ్య తన పొలంలో విభిన్న వ్యవసాయ కార్యకలాపాలను చేపడుతున్నారు. ఆయిల్‌పామ్ తోటలో అంతర పంటలుగా జామ, మునగ, బంతిపూల సాగు చేస్తున్నారు. వీటికి అనుబంధంగా నాటుకోళ్ల పెంపకాన్ని కూడా నిర్వహిస్తున్నారు. ఇలా ఒకే భూమిలో పలు రకాల పంటలు, అనుబంధ వ్యవసాయ రంగాలను సమన్వయం చేసుకుంటూ ఆదాయ వనరులను పెంచుకుంటున్నారు. పంటల సాగులో లాభనష్టాలు, దిగుబడులు, మార్కెటింగ్ అవకాశాలపై కలెక్టర్ ఆయనను అడిగి తెలుసుకున్నారు.నీటి పొదుపునకు ప్రాధాన్యంప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు, నీటి ఎద్దడి ఎదురయ్యే అవకాశాల నేపథ్యంలో రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కూరగాయలు, పూలు, ఇతర ఆరుతడి పంటల సాగుతో అధిక ఆదాయం పొందే దిశగా ఆలోచించాలన్నారు. ప్రభుత్వం ఉద్యాన పంటలకు ప్రాధాన్యత ఇస్తోందని, అందుబాటులో ఉన్న రాయితీలు, ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలని సూచించారు.మల్లయ్య పొలంలో ప్రభుత్వం అందించిన బిందు సేద్యం పరికరాల పనితీరును, వ్యవసాయ క్షేత్రం చుట్టూ ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్ వ్యవస్థను కలెక్టర్ పరిశీలించారు. నీటిని పొదుపుగా వినియోగిస్తూ పంటల సాగు చేస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు.యువతకు ఆదర్శంగా మల్లయ్యఉన్నత విద్య అభ్యసించినప్పటికీ ఉద్యోగం రాలేదని నిరుత్సాహపడకుండా వ్యవసాయాన్నే ఉపాధి మార్గంగా ఎంచుకోవడం మల్లయ్య ప్రత్యేకత. పరిమిత భూమిలో ప్రణాళికాబద్ధంగా సమీకృత వ్యవసాయం చేపట్టి ఆదాయాన్ని పెంచుకుంటున్న ఆయన యువతకు, ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. తక్కువ భూమి ఉన్నా విభిన్న పంటలు, అనుబంధ రంగాల ద్వారా మెరుగైన ఆర్థిక అవకాశాలను సృష్టించుకోవచ్చని, ఇతర రైతులు కూడా మల్లయ్య విధానాలను అనుసరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి తీగల నాగయ్య, తహసీల్దార్ శ్రీనివాస్ రావు, తుంగతుర్తి డివిజన్ ఉద్యాన అధికారిణి వి. ప్రమిత, మండల వ్యవసాయ అధికారి సైదా నాయక్, వ్యవసాయ విస్తరణ అధికారి బి. జానయ్య, ఉద్యాన విస్తరణ అధికారి కట్టగూరి రాము తదితరులు పాల్గొన్నారు.

కారు వెళ్లని దారిలో బైక్‌పై కలెక్టర్ పర్యటన

రీ సర్వే పనుల పరిశీలనకు స్వయంగా క్షేత్ర స్థాయికి.రైతులను భాగస్వాములను చేసి భూ సర్వే పూర్తి చేయాలని సూచన

ముద్ర, సూర్యాపేట, నవంబర్ 20: క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ పనుల పురోగతిని తెలుసుకోవడంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. పనుల పరిశీలన కోసం ప్రయాణ మార్గంలో ఎదురయ్యే ఇబ్బందులను సైతం అధిగమిస్తూ ముందుకు సాగుతున్నారు. నూతనకల్ మండలం దిర్శనపల్లి గ్రామ పర్యటనలో కలెక్టర్ వ్యవహరించిన తీరు ఇందుకు నిదర్శనంగా నిలిచింది. గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ బీమా యోజన పథకాన్ని ప్రారంభించిన అనంతరం, అదే గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ భూముల రీ సర్వే పనులను పరిశీలించేందుకు కలెక్టర్ వెళ్లారు. అయితే సర్వే ప్రాంతానికి వెళ్లే మార్గంలో కారు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో అక్కడే ఉన్న ద్విచక్రవాహనంపై తహసీల్దార్ శ్రీనివాసులుతో కలిసి బయలుదేరారు. బైక్‌పై సర్వే ప్రాంతానికి చేరుకున్న ఆయన అక్కడ జరుగుతున్న పనులను స్వయంగా పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.1,240 ఎకరాల్లో 800 ఎకరాల సర్వే పూర్తిదిర్శనపల్లి గ్రామ పరిధిలో మొత్తం 1,240 ఎకరాల భూమికిగాను ఇప్పటివరకు 800 ఎకరాల్లో రీ సర్వే పూర్తయినట్లు తహసీల్దార్ కలెక్టర్‌కు వివరించారు. మిగిలిన సర్వే పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.రీ సర్వే ప్రక్రియలో రైతులను భాగస్వాములను చేయాలని, వారి సహకారం, సూచనలతో సర్వే నిర్వహిస్తే పనులు మరింత వేగంగా, పారదర్శకంగా పూర్తవుతాయని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య కాలేజీలో విద్యార్థి ఆత్మహత్య

విద్యార్థి సంఘాల ఆందోళన..

ముద్ర, రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని బొంగులూరు సమీపంలో ఉన్న శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో విషాదం చోటుచేసుకుంది. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న కార్తీక్ (16) అనే విద్యార్థి గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో నూతన గృహప్రవేశం వేడుక ఉన్నందున ఇంటికి వెళ్లాలని కోరినా ప్రిన్సిపల్ సెలవు ఇవ్వకపోవడంతో మనస్తాపం చెందిన కార్తీక్ ఈ దారుణ నిర్ణయం తీసుకున్నాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రిన్సిపల్ తీరుపై ఆరోపణలు.. మృతదేహం తరలింపుపై వివాదం

శ్రీ చైతన్య కళాశాల ప్రిన్సిపల్ వ్యవహరించిన తీరు వల్లే కార్తీక్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని పలువురు ఆరోపిస్తున్నారు. మరోవైపు ఈ ఘటన తర్వాత కళాశాల యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని తరలించిందన్న ఆరోపణలు కూడా వెల్లువెత్తాయి. ఈ పరిణామాలతో విద్యార్థి వర్గాల్లో ఆగ్రహం వ్యక్తమైంది.కార్తీక్ మృతి వార్త తెలియడంతో విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న వెంటనే ఆదిభట్ల పోలీసులు కళాశాల వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

దరఖాస్తుల నమోదులో తప్పులు లేకుండా చూసుకోవాలి

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా దరఖాస్తుల నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం యాదగిరిగుట్ట మున్సిపాలిటీ లోని న్యూ గుండ్లపల్లిలో 7,8 వార్డు, భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 8, 10వ వార్డులలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల నమోదు ప్రక్రియను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా దరఖాస్తుల నమోదు విధానం, లబ్ధిదారుల వివరాల సేకరణ, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీ,గ్రామపంచాయతీలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల్లో ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫోన్ నంబర్ తో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అర్హులకు రూ.5 లక్షల జీవిత బీమా

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి: భువనగిరి పట్టణంలోని 18, 35, 6, 7 వార్డులకు సంబంధించి నెహ్రూ–కెన్నెడీ పార్కులో నిర్వహించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 నుంచి 59 ఏళ్ల వయస్సు కలిగిన అర్హులకు రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడం ద్వారా కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకంలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి, వైస్ చైర్‌పర్సన్ మంజుల, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో వైభవంగా కోటి పుష్పార్చన



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో కార్తీక వైభవోత్సవాల్లో భాగంగా శుక్రవారం సహస్రనామావళి సహిత కోటి పుష్పార్చన కార్యక్రమం వైభవంగా ప్రారంభమైంది. వేదమంత్రోచ్చారణలు, మేళతాళాల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు సేవ చేపట్టారు. అనంతరం పుష్పార్చన మండపంలో సహస్రనామావళి పారాయణంతో కోటి పుష్పార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, దేవస్థానం ఈఓ జె. భవానీ శంకర్, వేద పండితులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు.

బీమాతో కుటుంబానికి భరోసా

ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి

ముద్ర, మేడ్చల్, నవంబర్ 20: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని మేడ్చల్ జిల్లా స్థాయిలో తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ప్రారంభించారు. మేడ్చల్ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని కోటి 10 లక్షల కుటుంబాలకు బీమా రక్షణ కల్పించనున్నట్లు తెలిపారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన కుటుంబ యజమానికి ఈ పథకం



వర్తిస్తుందని, వారి కుటుంబానికి రూ.5 లక్షల బీమా సదుపాయం అందుతుందని వివరించారు.అలాగే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కొత్తగా 72,333 మందికి చేయూత పింఛన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, పరమేశ్వర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్లు చరణ్ కౌశిక్, అజయ్ కుమార్, మన్నె రాజు, జోనల్ కమిషనర్లు సంచిత్ గంగ్వార్, రాధిక గుప్తా, మున్సిపల్ చైర్మన్ శిరీషా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
శనివారం 21.11.2026

గుండె ఆరోగ్యానికి మేలు




కొత్తిమీరలోని యాంటీఆక్సిడెంట్లు గుండె ఆరోగ్యానికి తోడ్పడతాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్ (LDL) తగ్గించడంలో, రక్తపోటు నియంత్రణకు సహాయపడే అవకాశం ఉంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు కొత్తిమీరను ఆహారంలో భాగంగా చేర్చుకోవచ్చు.

ప్రతి కుటుంబానికి జీవిత బీమాతో ఆర్థిక భరోసా

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు ప్రక్రియ ప్రారంభించిన మంత్రి పొన్నం
నవంబర్ 26న ఇందిరమ్మ చీరల పంపిణీ
రూ.4.75 లక్షల నూతన చేయూత పింఛన్ల నగదు జమ

ముద్ర, సిద్దిపేట, నవంబర్ 20: రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించి ఆర్థిక భరోసా అందించడమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం కోహెడ మండలం తంగళ్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియను మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో దేశంలోనే తొలిసారిగా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించే పథకానికి తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఇందిరమ్మ జయంతి సందర్భంగా సిద్దిపేటలో ముఖ్యమంత్రి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించినట్లు తెలిపారు.గతంలో ఎక్స్‌గ్రేషియా వంటి ఆర్థిక సహాయాలు ప్రధానంగా భూమి కలిగిన రైతులకే పరిమితమయ్యేవని, ప్రస్తుతం ఈ పథకం ద్వారా ఏ వృత్తిలో ఉన్నవారికైనా కుటుంబ జీవిత బీమా రక్షణ కల్పిస్తున్నట్లు



వివరించారు. లబ్ధిదారులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదని, మొత్తం ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. అర్హులైన కుటుంబాలు సంబంధిత దరఖాస్తు ఫారమ్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు.రాష్ట్రవ్యాప్తంగా 12 వేల గ్రామాల్లో గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నమోదు కార్యక్రమం కొనసాగుతోందని, గ్రామ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీడీవోలు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ ప్రక్రియలో భాగస్వాములవుతున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

నవంబర్ 26న ఇందిరమ్మ చీరల పంపిణీ

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నవంబర్ 26న రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని



చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. అదే రోజు కొత్తగా మంజూరైన 4.75 లక్షల చేయూత పింఛన్ల నగదును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు.ప్రజాపాలన ప్రభుత్వం ఇప్పటికే రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని, ఇళ్లు లేని అర్హులైన మిగిలిన కుటుంబాలకు కూడా ఇళ్లు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడం, పేదలకు సొంత ఇల్లు అందించడం, ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేయడమే ప్రజాపాలన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

పిల్లల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

కలెక్టర్ ప్రతిమా సింగ్
జిల్లా వ్యాప్తంగా 492 బాలల రక్షణ కమిటీలను పునరుద్ధరిస్తాం
ఘనంగా ప్రపంచ బాలల దినోత్సవ వేడుకలు



ముద్ర ప్రతినిధి, మెదక్: బాలలే దేశ భవిష్యత్తు నిర్మాతలనికలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.మెదక్ కలెక్టరేట్‌లో శుక్రవారం ప్రపంచ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని వేడుకలు ఘనంగా నిర్వహించగా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరైమాట్లాడారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, ఆరోగ్యం, పోషకాహారం, రక్షణ కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.పిల్లల హక్కులను పరిరక్షిస్తూ, బాలల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి చిన్నారికి సమాన విద్యావకాశాలు కల్పించాలని, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, బాలలపై వేధింపులను పూర్తిగా నిర్మూలించేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 492 గ్రామాల్లో బాలల రక్షణ కమిటీలను పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని, చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని అన్నారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రుభిన ఫాతిమా మాట్లాడుతూ...ప్రతి బాలుడు, బాలిక భయంలేని వాతావరణంలో ఆనందంగా బాల్యాన్ని గడుపుతూ ఉన్నత లక్ష్యాలను సాధించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు.అనంతరం బాలల హక్కుల రూపొందించిన పాటను ఆవిష్కరించారు.వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీలకు ప్రశంసా పత్రం, జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, డిప్యూటీ డిఎమ్‌హెచ్‌ఓ హరి ప్రసాద్మెదక్ సీడీపీఓ వెంకటరమణ, ఏసీడీపీఓ సల్మా సుల్తానా, మెప్మా పిడి హన్మంతరెడ్డి, జ్యోతి, ఉప్పలయ్య,సునీత, కొర్రపాటి రాకేష్, రాహుల్, కైలాష్,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు

దేశంలోనే ఒక వినూత్న కార్యక్రమం

కలెక్టర్ ప్రతిమా సింగ్

ముద్ర ప్రతినిధి, మెదక్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దేశంలోనే ఒక వినూత్న కార్యక్రమమని కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు.శుక్రవారంచేగుంట మండలం కర్నాల్ పల్లి గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం గ్రామ సభకు హాజరై లాంఛనంగా ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఈ పథకం వివరాలను ప్రజలకు తెలియజేశారు. ఈ పథకం ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తుందని అన్నారు. సాధారణంగా ఎల్ఐసీ వంటి జీవిత బీమా పథకాల కోసం ప్రజలు ప్రతి ఏటా సొంతంగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద రాష్ట్రంలోని కోటి పైచిలుకు కుటుంబాలకు ప్రభుత్వమే



ప్రీమియం చెల్లిస్తుందని తెలిపారు. తద్వారా ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం వర్తింపజేస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి హేమ భార్గవి, ఎంపీడీవో చెన్నారెడ్డి, తహసిల్దార్ బాల లక్ష్మి , గ్రామ సర్పంచ్ దుర్గా రామ గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.క్విజ్ పోటీలతో విజ్ఞాన వికాసం గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం, వారిలో పోటీతత్వాన్ని పెంపొందించడం, సాధారణ పరిజ్ఞానం పట్ల ఆసక్తిని కలిగించాలనే ఉన్నత లక్ష్యంతో విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. చిన్న శంకరంపేట్ మండల కేంద్రంలోని కేజీబీవి, ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్ విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి క్విజ్ పోటీలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.క్విజ్ జరుగుతున్న తీరును, విద్యార్థులకు అడుగుతున్న జనరల్ నాలెడ్జ్, సైన్స్, గణితం మరియు సాంఘిక శాస్త్ర ప్రశ్నల ప్రమాణాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో ఇలాంటి విద్యా సంబంధిత కార్యక్రమాలు మరిన్ని నిర్వహిస్తామన్నారు.

ఎస్ఎఫ్ఐ మెదక్ టౌన్ అధ్యక్షుడిగా సిద్దు



ముద్ర ప్రతినిధి, మెదక్: ఎస్ఎఫ్ఐ మెదక్ టౌన్ నూతన కమిటీ అధ్యక్షులు సిద్దు ఎన్నికయ్యారు. కార్యదర్శిగా రాకేష్,ఉపాధ్యక్షులుగా అనుష్క, సహాయ కార్యదర్శిగా నాగమణి, కమిటీ సభ్యులుగా 11 మందిని ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ మెదక్ పట్టణంలోని కళాశాలలు, విద్యాసంస్థల్లో విద్యార్థులను సంఘటితం చేస్తూ వారి సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాలని మహాసభ పిలుపునిచ్చింది. విద్యార్థుల హక్కుల కోసం ఎస్ఎఫ్ఐ ఉద్యమాన్ని పట్టణ స్థాయిలో మరింత బలోపేతం చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో చరణ్. లక్ష్మీన్, ధనసింగ్, వికాస, ప్రేమ దాస్, ముకేష్, హరికృష్ణ . ప్రసన్న. సౌమ్య. మమత తదితరులు పాల్గొన్నారు.

టీజీఎస్ ఆర్టీసీ హైదరాబాద్ జోన్‌లో 63 మందికి పదోన్నతులు

జూనియర్ అసిస్టెంట్, డిప్యూటీ సూపరింటెండెంట్ హోదాల్లో ఉన్నత అవకాశాలు
ఉద్యోగులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలి
జోన్ ఈడీ ఖుశ్రో షా ఖాన్

ముద్ర, హైదరాబాద్, నవంబర్ 20: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) హైదరాబాద్ జోన్ పరిధిలో 63 మంది ఉద్యోగులకు వివిధ ఉన్నత హోదాల్లో పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుశ్రో షా ఖాన్ ఉత్తర్వులు జారీ చేశారు.పదోన్నతుల వివరాలుమొత్తం 63 మందిలో 28 మందికి జూనియర్ అసిస్టెంట్ (ఫైనాన్స్), 27 మందికి జూనియర్ అసిస్టెంట్ (పర్సనల్), మరో 8 మందికి డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్) హోదాల్లో పదోన్నతులు కల్పించారు. జూనియర్ అసిస్టెంట్ (ఫైనాన్స్)గా పదోన్నతి పొందిన 28 మందిలో 23 మంది కండక్టర్లు, ముగ్గురు డ్రైవర్లు, ఇద్దరు ఆఫీసర్లు (ఆర్‌సీఎల్)



ఉన్నారు. జూనియర్ అసిస్టెంట్ (పర్సనల్)గా 27 మంది కండక్టర్లకు పదోన్నతులు లభించాయి. అలాగే డిపో కంట్రోలర్లు (డీసీఎల్), ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు (టిటిఐ–III), ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ల విభాగాలకు చెందిన ఎనిమిది మందికి డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్) హోదా కల్పించారు.పరీక్షల్లో అర్హత సాధించిన వారికి అవకాశంఈ పదోన్నతుల ప్రక్రియలో భాగంగా 2025 మే 25న నిర్వహించిన డిపార్ట్‌మెంటల్ రాత పరీక్షతో పాటు, అదే ఏడాది జూలై 27న నిర్వహించిన కంప్యూటర్ స్కిల్ టెస్ట్‌లో అభ్యర్థులు అర్హత సాధించారు.ఉద్యోగులకు ఎండీ అభినందనలుపదోన్నతులు పొందిన ఉద్యోగులకు టీజీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ అభినందనలు తెలిపారు. కొత్త బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ సంస్థ ప్రతిష్టను పెంపొందించాలని, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ జోన్ ఈడీ ఖుశ్రో షా ఖాన్ కూడా పదోన్నతులు పొందిన ఉద్యోగులను అభినందించారు. కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఉద్యోగుల ప్రతిభ, అర్హతలకు తగిన గుర్తింపు కల్పించడం ద్వారా వారిలో పని పట్ల మరింత ఉత్సాహం, నిబద్ధత పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన యువకుడి అరెస్ట్

రూ.20 లక్షల 70 వేల వసూలు చేసిన నిందితుడు



ముద్ర ప్రతినిధి, మెదక్:ప్రభుత్వ బిల్లులు క్లియర్ చేయిస్తా, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తాన నిమోసం చేసి ఇద్దరు వ్యక్తుల నుండి రూ.20 లక్షల 70 వేల మోసం చేసిన నిందితుడిని మెదక్ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. పిట్లంబేస్ కు చెందిన అలకంటి యశ్వంత్ నిందితుడిగా గుర్తించారు. మెదక్ పట్టణానికి చెందిన మ్యాదం శివ రాములుతో పరిచయం ఏర్పడగా ఆర్ అండ్ బి శాఖకు సంబంధించిన 3 కోట్ల బిల్లులు ఇప్పిస్తానని, అందుకు బిల్లుల మొత్తంలో 10 శాతం కమీషన్ ఇవ్వాలని కోరగా, నిందితుడి మాటలు నమ్మిన శివరాములు నిందితుడి తండ్రి అలకంటి మహేష్ పేరు మీద ఉన్న ఐఓబి ఖాతాకు 10 లక్షల రూపాయలు బదిలీ చేశారు. అయితే, నిందితుడు బిల్లులు క్లియర్ చేయించకుండా, డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగినప్పుడు సరైన సమాధానం చెప్పకుండా తప్పించుకుంటూ బాధితుడిని మోసం చేశాడు.అదే విధంగా, గతంలో నర్సాపూర్‌కు చెందిన మెయ్యడి దశరథ్ అనే వ్యక్తికి ఆర్టీసీ బస్సులో పరిచయమై, తాను సచివాలయంలో ఉద్యోగం చేస్తున్నానని, టిఎస్పిడీసీఎల్ లో ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి అతని వద్ద నుండి రూ.10.70 లక్షల రూపాయలు తీసుకున్నాడు. ఉద్యోగం కోసం బాధితుడు అడిగినప్పుడు నకిలీ ఉద్యోగ నియామక పత్రాన్ని పంపించి అతనిని మోసం చేశాడు.ఈ విధంగా ఇద్దరు బాధితుల వద్ద నుండి మొత్తం రూ.20.70 రూపాయలు మోసపూరితంగా వసూలు చేసి, ఆ డబ్బులను నిందితుడు, అతని తండ్రి మహేష్ తమ వ్యక్తిగత ఖర్చుల నిమిత్తం వినియోగించుకున్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.ఈ కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడిని విచారించి, అతని వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌ను పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకోవడం జరిగింది.ప్రజలు ఇటువంటి మోసపూరిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని, ప్రభుత్వ బిల్లులు త్వరగా మంజూరు చేయిస్తామని చెప్పే వ్యక్తులను నమ్మి ముందస్తుగా డబ్బులు చెల్లించకూడదు. ఇలాంటి మోసాలకు గురైనట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని మెదక్ టౌన్ ఇన్స్పెక్టర్ డి. మహేష్ తెలిపారు.

వేసవి విద్యుత్ డిమాండ్‌ను ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు

33/11 కేవీ సబ్‌స్టేషన్ల వద్ద బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు
జీఐఎస్ ఆధారిత నెట్‌వర్క్ ప్లానింగ్‌కు ప్రాధాన్యం
భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థ బలోపేతం
అధికారులకు సీఎండీ జితేష్ వి. పాటిల్ ఆదేశాలు

ముద్ర, హైదరాబాద్, నవంబర్ 20: రానున్న వేసవిలో పెరగనున్న విద్యుత్ డిమాండ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. విద్యుత్ పంపిణీ వ్యవస్థపై అదనపు భారం పడకుండా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలని సంస్థ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. భవిష్యత్ విద్యుత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మింట్ కాంపౌండ్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్లు, చీఫ్ ఇంజినీర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో వచ్చే వేసవి కార్యాచరణ ప్రణాళిక, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ , రియాక్టివ్ పవర్ నియంత్రణ, వోల్టేజ్ నిర్వహణ, జీఐఎస్ ఆధారిత నెట్‌వర్క్ మ్యాపింగ్, భవిష్యత్ విద్యుత్ లోడ్ అంచనాలపై సీఎండీ సమీక్షించారు.సాయంత్రం వేళ డిమాండ్‌కు బ్యాటరీ స్టోరేజ్‌గటిపూట అందుబాటులో ఉండే సౌర విద్యుత్‌తో బ్యాటరీలను ఛార్జ్ చేసి, సాయంత్రం విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న సమయంలో నిల్వ చేసిన విద్యుత్‌ను వినియోగించడం ద్వారా పవర్ ట్రాన్స్‌ఫార్మర్లపై ఒత్తిడిని తగ్గించవచ్చని సీఎండీ తెలిపారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్ల వద్ద బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో సాయంత్రం పెరిగే గృహ విద్యుత్ వినియోగం, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ అవసరాల కారణంగా ఏర్పడే డిమాండ్‌ను సమగ్రంగా విశ్లేషించాలని ఆదేశించారు. ఓవర్‌లోడ్‌కు గురవుతున్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చిన్నస్థాయి బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను కూడా పరిశీలించాలన్నారు.సోలార్ ఇన్వర్టర్లతో రియాక్టివ్ పవర్ నియంత్రణ విద్యుత్ వ్యవస్థలో అవసరానికి అనుగుణంగా రియాక్టివ్ పవర్ సరఫరా, గ్రహణం జరిగేలా సోలార్ ఇన్వర్టర్ల సాంకేతిక సామర్థ్యాలను వినియోగించుకోవాలని సీఎండీ సూచించారు. ఈ అంశంపై ఎంఆర్‌టీ, ప్రొటెక్షన్ ఇంజినీరింగ్ నిపుణులతో చర్చించి ఆచరణ సాధ్యమైన పరిష్కారాలను రూపొందించాలని ఆదేశించారు.వోల్టేజ్ నిర్వహణకు ఆధునిక పరిష్కారాలుకెపాసిటర్ బ్యాంకుల స్విచింగ్‌ను ఆపరేటర్లపై ఆధారపడకుండా ఆటోమేటిక్ విధానంలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సబ్‌స్టేషన్లలో ఇప్పటికే అందుబాటులో ఉన్న ఐఈడీ రిలేల్లోని ఓవర్ వోల్టేజ్ ప్రొటెక్షన్ సదుపాయాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. తక్కువ వ్యయంతో వోల్టేజ్ స్థాయిలను మెరుగుపరిచే సాంకేతిక పరిష్కారాలను గుర్తించి ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.జీఐఎస్ ఆధారిత నెట్‌వర్క్ ప్లానింగ్విద్యుత్ కనెక్షన్ కోసం వినియోగదారులు దరఖాస్తు చేసిన తర్వాత మౌలిక సదుపాయాలు కల్పించే సంప్రదాయ విధానానికి బదులుగా, భవిష్యత్తులో ఆయా ప్రాంతాల్లో ఏర్పడే నిర్మాణాలు, వాటి విద్యుత్ అవసరాలను ముందుగానే అంచనా వేసి నెట్‌వర్క్‌ను సిద్ధం చేయాలని సీఎండీ స్పష్టం చేశారు.ఇందులో భాగంగా సబ్‌స్టేషన్లు, ఫీడర్లు, విద్యుత్ లైన్లు, ఖాళీ స్థలాలు, భవిష్యత్తులో నిర్మించనున్న అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలు, భారీ విద్యుత్ వినియోగ కేంద్రాలను భౌగోళిక వివరాలతో జీఐఎస్ మ్యాప్‌లో పొందుపరచాలని సూచించారు.అపార్ట్‌మెంట్ల ఫ్లోర్ స్పేస్ ఏరియా, అంతస్తుల సంఖ్య, వినియోగదారుల కేటగిరీ ఆధారంగా నిర్మాణ దశలోనే భవిష్యత్ విద్యుత్ అవసరాలను అంచనా వేసేందుకు ప్రత్యేక అంతర్గత లోడ్ అంచనా కాలిక్యులేటర్‌ను రూపొందించాలని ఆదేశించారు.మూడేళ్ల విద్యుత్ అవసరాలకు ముందస్తు ప్రణాళికరాబోయే ఒకటి నుంచి మూడేళ్లలో ఏర్పడే విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటు, ప్రస్తుత సబ్‌స్టేషన్ల సామర్థ్య పెంపు, కొత్త ఫీడర్ల నిర్మాణం, స్విచింగ్ స్టేషన్ల ఏర్పాటు, ఓవర్‌లోడ్ ఫీడర్ల బలోపేతంపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎండీ ఆదేశించారు.100 మెగావాట్ల వంటి భారీ సామర్థ్యం కలిగిన సబ్‌స్టేషన్ల ఏర్పాటు మాత్రమే సరిపోదని, వాటికి అనుసంధానమైన విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్‌ను కూడా భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్విచింగ్ స్టేషన్ల బలోపేతం, ఎస్ఈసీఐ ద్వారా చేపట్టే ప్రాజెక్టులు, సంస్థ అంతర్గత పెట్టుబడులతో చేపట్టగల పనుల సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని సూచించారు.వినూత్న ఆలోచనలతో ముందుకు రావాలిసంస్థ అభివృద్ధి, విద్యుత్ పంపిణీ వ్యవస్థ సామర్థ్య పెంపు కోసం సీనియర్ ఇంజినీర్లు తమ క్షేత్రస్థాయి అనుభవం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వినూత్న ఆలోచనలు, ఆచరణ సాధ్యమైన ప్రతిపాదనలతో ముందుకు రావాలని జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. కేవలం ఆదేశాల అమలుకే పరిమితం కాకుండా సంస్థ అభివృద్ధికి దోహదపడే కొత్త ఆలోచనలను స్వయంగా ప్రతిపాదించాలని సూచించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు వట్టికొండ శివాజీ, డాక్టర్ ఎన్. నరసింహులు, చిలుకమారి చక్రపాణి, పి. కృష్ణారెడ్డితో పాటు వివిధ విభాగాల చీఫ్ ఇంజినీర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సాయి నగర్ జెట్ సమస్య పై ఎమ్మెల్యే సమీక్ష



ముద్ర, శేరిలింగంపల్లి :చందానగర్ డివిజన్ పరిధిలోని మదీనాగూడ సాయి నగర్ కాలనీ లో నెలకొన్న జెట్ లెట్ సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల పై జలమండలి అధికారులు మరియు సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి కలిసి పరిశీలించిన పీయేసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ సాయి నగర్ కాలనీ లో నెలకొన్న డ్రైనేజీ జెట్ లెట్ సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని, పనులు త్వరలోనే చేపడుతున్నామని, ప్రజల ఇబ్బందులను, కాలనీ వాసుల సమస్యను దృష్టిలో పెట్టుకొని పనులు త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. డ్రైనేజీ జెట్ లెట్ సరిగ్గా లేక కాలనీ ముంపుకు గురవుతుంది అని, నిత్యం డ్రైనేజీ పొంగి పొర్లుతూ ప్రజలు, కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, దీనికి శాశ్వత పరిష్కారం దిశగా అన్ని రకాల చర్యలను తీసుకోవాలని, పక్కా ప్రణాళికలు వేసుకొని పనులు ప్రారంభించాలని, ప్రతిపాదనలు సిద్ధం చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని, త్వరితగతిన పనులు పూర్తి చేసి కాలనీ వాసులకు అందుబాటులోకి తీసుకురావాలని,సాయి నగర్ కాలనీ లో ప్రశాంత వాతావరణం తీసుకువస్తామని తెలిపారు జెట్ లెట్ వలన మళ్ళీ డ్రైనేజీ సమస్య పునరావృతం కాకుండా జెట్ లెట్ నిర్మాణం చేపట్టాలని, వీటి నిర్మాణం పనుల పై జలమండలి అధికారులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చినట్లు తెలియచేశారు.శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని, అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని , మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని, చందానగర్ డివిజన్ మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో అధికారులు డిజీయమ్ నారాయణ, మేనేజర్ శిరీష, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, నాగరాజు, నరేందర్ బల్ల, స్వామి కాలనీ వాసులు పాల్గొన్నారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H. No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg. No. TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555